ANDHRAJYOTHY

ఆంధ్రజ్యోతి

ఏలూరు

జిల్లా వార్తలు

5

గురువారం 13 ఫిబ్రవరి 2025



చర్మవ్యాధితో బాధపడుతున్న కుక్క

కోళ్ల వ్యర్థాలే కారణమా..?

చర్మ వ్యాధులతో బాధపడుతున్న కుక్కలు

మనుషులకు సోకే అవకాశం..

జాగ్రత్తలు పాటించాలని వైద్యుల హెచ్చరికలు

పెదవేగి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):కుక్కలకు జబ్బు చేసింది. శరీరమంతా వ్యాపించిన చర్మవ్యాధుల కారణంగా కుక్కలు విలవిల్లాడుతున్నాయి. ఏ గ్రామంలో చూసినా రోగంతో అవస్థలు పడుతున్న కుక్కలే కనిపిస్తున్నాయి. పెంపుడు కుక్కలైతే యజమానులు చికిత్స చేయిస్తారు. వీధి కుక్కలు కావడంతో వాటికి సోకిన వ్యాధిని నయం చేయడానికి ఎవరూ ముందుకు రావడంలేదు. గ్రామంలో ఒకదాని నుంచి మరో దానికి వ్యాపిస్తోంది. వ్యాధి సోకిన కుక్క దరిదాపుల్లోకి రావడానికి ప్రజలు జంకుతున్నారు. కోడి వ్యర్థాలే కుక్కల చర్మవ్యాధికి కారణమని, ఇది గాలి ద్వారా ఇతర జంతువులు, మనుషులకు సోకే ప్రమాదం లేకపోలేదని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

కోడి వ్యర్థాలను తినడం వల్లే..



విచ్చలవిడిగా తిరిగే ఊరకుక్కలు మాంసం దుకాణాల దగ్గర లభించే కోడి వ్యర్థాలను తినడం కారణంగా చర్మవ్యాధులు సోకుతున్నాయి. కోళ్ల పెరుగుదలకు రైతులు యాంటీ బయాటిక్స్, ఇతర మందులను అధికంగా వినియోగిస్తున్నారు. వాటికి సంబంధించిన అవశేషాలు కోళ్ల పేగుల్లో ఎక్కువశాతం నిల్వ ఉంటుంది. కుక్కలు ఆ పేగులు, ఇతర వ్యర్థాలను తినడం కారణంగా చర్మ వ్యాధి (అలెర్జిక్) బారిన పడుతున్నాయి. వీధి కుక్కల్లో ప్రబలుతున్న ఈ వ్యాధిని అరికట్టడం కష్టంతో కూడుకున్న పని. వాటిని పట్టుకుని చికిత్స అందించడమనేది కష్టం. ఊరకుక్కలు కోడి వ్యర్థాలు తినేసమయంలో గుంపుగా ఉంటాయి. దీంతో ఒకదాని నుంచి మరొక కుక్కకు ఈ వ్యాధి తేలికగా వ్యాపిస్తుంది. అంతేకాక గాలిద్వారా మనుషులకు సోకే ప్రమాదం లేకపోలేదు.

– డాక్టర్ ఎం.తారకేశ్వరరావు, పెదవేగి మండల పశువైద్యాధికారి



వేల్పూరులో కోళ్ల ఫారం చుట్టూ బ్లీచింగ్ చల్లిన దృశ్యం

పౌల్ట్రీ ఫారం వద్ద పరిస్థితులను తెలుసుకుంటున్న తహసీల్దార్, పశువైద్యాధికారి

అధికారులకు ఫిర్యాదు చేశా..

తమ పౌల్ట్రీలో మూడు లక్షల కోళ్లకు రెండు లక్షల పది వేల కోళ్లు మృత్యువాత పడ్డాయి. ఈ సమయంలో రుణాలు కట్టాలని బ్యాంకు అధికారులు మీద ఒత్తిడి చేస్తున్నారు. దీనిపై ఏం చేయాలో అర్థం కావడం లేదని ఉంగుటూరు మండలం బాదంపూడి మణికంఠ పౌల్ట్రీస్ యజమాని కొన్ని రోజుల క్రితం జిల్లా కలెక్టర్‌కు, పశు సంవర్ధక శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. దీనిపై అధికారులు అప్రమత్తమై పౌల్ట్రీ ప్రాంతమంతా బ్లీచింగ్ చల్లించారు. పశుసంవర్ధక శాఖ అధికారిణి శిరీష మాట్లాడుతూ కోళ్ల నమూనాలను భోపాల్ ల్యాబ్‌కు పంపామని, ఫలితం కోసం ఎదురు చూస్తున్నామన్నారు.

వైరస్ కూత..

బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో సంక్షోభంలో పౌల్ట్రీ పరిశ్రమ

- **గుడ్డు ధర ధమాల్.. పది రూపాయలకే ఫారం కోడి**
- **మిగిలిన కోళ్లను కాపాడుకునేందుకు లక్షల్లో ఖర్చు**

తాడేపల్లిగూడెం రూరల్/తణుకు రూరల్/పాలకోడేరు/ఉంగుటూరు/ముదినేపల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఉభయ గోదావరి జిల్లాల్లో బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్‌తో పౌల్ట్రీ పరిశ్రమ సంక్షోభంలో పడింది. కోడి గుడ్డు రూ.5.50 నుంచి రూ.3.50కు పడిపోయింది. ఫారం కోడి పది రూపాయలకే లభిస్తోంది. అసలే అంతంత మాత్రంగా వున్న పౌల్ట్రీ వీటి ప్రభావాలతో మరింత కుదేలైంది. పోనీలే కొన్ని రోజులు చూద్దామనుకునే పరిస్థితి రైతులకు కనిపించడం లేదు. ఓ వైపు బర్డ్‌ఫ్లూ ఎఫెక్ట్ తమ పౌల్ట్రీలోనూ వస్తుందేమో అని భయంతో వైద్యులు చెప్పిన వ్యాక్సిన్‌లు వాడుతున్నారు. మనుషులను పెట్టి ఫారం చుట్టూ పది కిలోమీటర్ల వరకూ మందులు పిచికారీ చేయిస్తున్నారు. ఈ ఖర్చు తడిసి మోపెడవుతోంది. ఈ తరుణంలో కోడి గుడ్ల, కోళ్లు కాపాడుకోలేక కొన్నిచోట్ల ఒక్కోటి రూ.10కి తెగనమ్ముకుంటున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో కోటి 15 లక్షల ఫారం కోళ్లు ఉండగా వైరస్ వల్ల 40 లక్షల కోళ్లు మృత్యు వాత పడ్డాయి. 75 లక్షల కోళ్లు మాత్రమే మిగిలాయి.

కోళ్లకు బర్డ్ ఫ్లూ సోకిన తణుకు రూరల్ మండలం వేల్పూరు కృష్ణానందం పౌల్ట్రీ ఫారం నుంచి కిలోమీటరు పరిధిలోని పరిసరాలను అధికారుల పర్యవేక్షణలో శానిటేషన్ కార్యక్రమాలు ముమ్మరం చేశారు. వేల్పూరు పరిధిలోని రెడ్ జోన్‌లోని ఐదు ఫారాల్లో కోళ్లను రాత్రికి రాత్రి వేరే చోటకు తరలించి ఫారాలను ఖాళీ చేశారు. బర్డ్‌ఫ్లూ నిర్ధారణ జరిగిన ఫారం కోళ్లను గురువారం ఖననం చేయనున్నట్లు పశువైద్యాధికారి డాక్టర్ కెశంకర్ బావనారాయణ తెలిపారు.



వడాలి ఫారంలో మృతి చెందిన నాటు కోళ్లు

- వైరస్‌ల ఉధృతి నుంచి తమ కోళ్లను కాపాడుకునేందుకు తాడేపల్లిగూడెం మండలంలోని ఓ పౌల్ట్రీ రైతు చేయని ప్రయత్నం లేదు. పది రోజులుగా కోళ్లకు నాలుగు రకాల వ్యాక్సిన్, పరిసరాల చుట్టూ రోజూ మందులు పిచికారి, లోపలికి వెళ్లే కూలీలకు ప్రత్యేక శానిటైజేషన్‌తో రూ.పది లక్షలకు పైగానే ఖర్చయింది.
- పౌల్ట్రీల్లో బ్రాయిలర్ కోళ్లను మృత్యువాతకు గురిచేస్తున్న వైరస్ నాటు కోళ్లను కూడా తాకింది. ముదినేపల్లి ప్రాంతంలో రెండు రోజులుగా నాటు కోళ్లు చనిపోతూనే ఉన్నాయి. వడాలిలో ఒక నాటు కోళ్ల ఫారంలో 150 కోళ్లను పెంచుతుండగా 140 కోళ్లు వైరస్ బారిన పడి చనిపోయాయి. మంగళవారం ఒకేసారి 80 కోళ్లకు పైగా చనిపోగా వాటిని పాతి పెట్టారు. బుధవారం మరో 20 కోళ్లు చనిపోగా, వాటిని తగులబెట్టారు. రూ.3 లక్షల నష్టం కలిగిందని యజమాని సాయిబాబు ఆవేదన వ్యక్తం చేశాడు. నాటు కోళ్లకు సోకుతున్న వ్యాధులను పరిశీలించి చర్యలు తీసుకుంటామని మండల పశువైద్యాధికారి, డాక్టర్ క్రాంతి కుమార్ తెలిపారు.

బాదంపూడి కోళ్లకు బర్డ్‌ఫ్లూ
కిలోమీటరు పరిధిలో రెడ్‌జోన్ : కలెక్టర్

ఉంగుటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బాదంపూడిలోని శ్రీ వేంకట మణికంఠ పౌల్ట్రీ ఫారంలో కోళ్లకు బర్డ్‌ఫ్లూ సోకినట్టు పరీక్షల్లో నిర్ధారణ కావడంతో దీనిచుట్టూ పది కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ కె.వెట్రిసెల్వి పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి ఏలూరులోని కలెక్టర్ క్యాంప్ కార్యాలయం నుంచి బర్డ్‌ఫ్లూ నివారణ, నియంత్రణ, కార్యాచరణపై వివిధ శాఖల అధికారులతో సమీక్షించారు. బాదంపూడి పౌల్ట్రీ నుంచి కిలోమీటరు రెడ్ జోన్‌గా, పది కిలోమీటర్లు సర్వే లెన్స్ జోన్‌గా పరిగణిస్తున్నట్టు ప్రకటించారు. జిల్లా పశు సంవర్ధక కార్యాలయంలో కంట్రోల్ రూమ్ 99667 79943 నెంబరుతో ఏర్పాటు చేశామన్నారు. గ్రామం పది కిలోమీటర్ల పరిధిలో 144, 133 సెక్షన్లను అమలు చేస్తారన్నారు. పది కిలో మీటర్ల పరిధిలో వున్న వారు కొన్ని రోజులపాటు చికెన్, కోడి గుడ్లు తినడం తగ్గించా లని, పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. ఏ ఒక్కరిలో వైరస్ లక్షణాలు కనిపించినా యాంటీ వైరస్ మం దులు అందిం చేందుకు సిద్ధంగా ఉన్నామని జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ టి.గోవిందరాజు తెలిపారు.

ఏలూరులో ఫ్లాష్ మాబ్..



ప్రజలలో దంతవైద్యం, శస్త్ర చికిత్సలు, నోటి క్యాన్సర్ పై అవగాహన కల్పించే నిమిత్తం దుగ్గిరాలలోని సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ పీజీ, యూజీ విద్యార్థులు ఏలూరులో బుధవారం ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ప్రత్యేక డ్రస్సులతో రోడ్డుపై నృత్యాలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. 6



638 మొబైల్స్ అప్పగింత

జిల్లాలో మొబైల్స్ పోగొట్టుకున్న పలువురు బాధితులకు పోలీసులు ఊరట కలించారు. వారు పోగొట్టుకున్న రూ.76 లక్షల 56 వేలు విలువైన 638 మొబైల్స్‌ను రికవరీ చేసి బుధవారం ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్పీ కేపీఎస్ కిశోర్ అప్పగించారు. 7



ఏలూరు జిల్లా మొదటి బహుమతిని ఎస్పీ కేపీఎస్ కిశోర్ చేతుల మీదుగా అందుకుంటున్న డ్రైవర్ బి.పాపారావు (నూజివీడు డిపో)

ఆర్టీసీ సేవలు ప్రశంసనీయం

- **జిల్లా ఎస్పీ కిశోర్**

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : సురక్షితమైన ప్రయాణాన్ని కల్పిస్తున్న ఆర్టీసీ సేవలు ఎంతో ప్రశంసనీయమని ఎస్పీ కేపీఎస్ కిశోర్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మాసోత్సవాలు ముగింపు సందర్భంగా ఏలూరులోని ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్లకు బహుమతి ప్రదాన కార్యక్రమాన్ని బుధవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై అవార్డు గ్రహీతలకు అవార్డులను బహూకరించి సన్మానించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరు డ్రైవింగ్ చేసేటప్పుడు విధిగా ఏకాగ్రతతో ఉండాలన్నారు. జిల్లా ప్రజారవాణాశాఖ అధికారి ఎన్‌వీఆర్ వర ప్రసాద్ మాట్లాడుతూ గతేడాదితో పోలిస్తే ప్రమాదాలు తగ్గాయన్నారు. ఏలూరు, నూజివీడు, జంగారెడ్డిగూడెం డిపో మేనేజర్లు బి.వాణి, పవన్‌కుమార్, గంగాధర్, డిపోల ఏఎంపీలు, కార్మిక సంఘాల నాయకులు, పీఆర్వో నరసింహం తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతలు వీరే..

జిల్లాలోని ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు డిపోలలో డ్రైవర్లలో ఇప్పటి వరకు వారి సీనియార్టీని బట్టి ఎలాంటి ప్రమాదాలు లేకుండా ఉత్తమ డ్రైవింగ్ చేసిన ముగ్గురికి ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులను అందించారు. నూజివీడు డిపోకు చెందిన బి.పాపారావు (ప్రథమ), ఏలూరు డిపోనకు చెందిన జె.చెల్లయ్య (ద్వితీయ), జంగారెడ్డిగూడెం డిపోనకు చెందిన బి.కృష్ణారెడ్డి (తృతీయ)లకు జిల్లా స్థాయిలో ఉత్తమ అవార్డులను ఎస్పీ అందించారు. ఏలూరు డిపో పరిధిలో ఆర్‌వీరావు, పీవీవీవీ రావు, డీఆర్ కృష్ణలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ అవార్డులను అందించారు. జంగారెడ్డిగూడెం డిపో పరిధిలో బీవీఎస్ఎన్‌టీ రాజు, ఎం.చిన్నయ్య, ఎం.బాబూరావులకు ప్రథమ, ద్వితీయ, తృతీయ, నూజివీడు డిపో పరిధిలో డీవీకే రావు, బీవీ రావు, కేఆర్ కృష్ణలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందించారు.



ద్వితీయ, తృతీయ బహుమతులు అందుకుంటున్న జె.చెల్లయ్య, బి.కె.రెడ్డి

పేదల గుండెకు భరోసా

- **రూ.45 వేల విలువైన ఇంజక్షన్ ఇకపై అందరికి ఉచితం**
- **జిల్లాలోని సెకండరీ ఆసుపత్రులలో అందుబాటులో..**

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత సమాజంలో వయస్సుతో సంబంధం లేకుండా గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని గుండె పోటుకు గురైన వారికి గోల్డెన్ అవర్‌లో టినక్టీ ప్లేజ్ ఇంజెక్షన్ ఇవ్వడం ద్వారా వారి జీవితం నిలుస్తుందని ఏలూరు జిల్లా ప్రభుత్వాసుపత్రుల సమన్వయాధికారి డాక్టర్ బి.పాల్ సతీష్‌కుమార్ అన్నారు. ఏలూరు ప్రభుత్వాస్పత్రి ఆవరణలోని డీసీహెచ్ కార్యాలయంలో ఈ ఇంజక్షన్‌కు సంబంధిం అవగాహన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గుండెపోటు వచ్చిన తొలిగంటలోనే ఈ అత్యవసర ఇంజక్షన్ ఇస్తే రోగి ప్రాణాలను కాపాడే అవకాశం ఉందన్నారు. ఇది కాస్త ఖర్చుతో కూడిన వ్యవహారమని, రాష్ట్ర ప్రభుత్వం దీనిపై దృష్టి సారించి గుండెనొప్పి రోగులకు ఉపశమనం కలిగించేలా స్టెమీ అనే కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. రూ.45 వేల విలువైన ఆ ఇంజక్షన్‌ను ఉచితంగా అందించనుందన్నారు. జిల్లాలోని అన్ని సెకండరీ హెల్త్ ప్రభుత్వ ఆసుపత్రులలో ఈ ఇంజక్షన్ అందుబాటులో ఉంటుందని, ఫిజీషియన్ స్పెషలిస్టుచే గుండె వ్యాధిగ్రస్తులకు ఈ ఇంజక్షన్ చేస్తారన్నారు.



వాల్‌పోస్టర్‌ను విడుదల చేస్తున్న డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్‌సతీష్‌కుమార్



అంతా మా ఇష్టం..!

- **ఏలూరు ప్రభుత్వాస్పత్రిలో అధికారుల ఇష్టారాజ్యం**
- **డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవలో ఉద్యోగుల తొలగింపు..**
- **దొడ్డిదారిన కొత్తవారు నియామకం**
- **ఆస్పత్రి అభివృద్ధి కమిటీతో మాకేంటి పని?**
- **అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు**

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులోని ప్రభుత్వాస్పత్రి డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ శాఖకు సంబంధించి టీచింగ్ ఆస్పత్రిగా మార్పు చెందిన తర్వాత ప్రతిరోజు వివాదాలతోనే మునిగిపోతోంది. ఇక్కడ కొందరు అధికారులు 'అంతా మా ఇష్టం' అన్నట్టుగా వ్యవహరించడంపై విమర్శలు వస్తున్నాయి. డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) పరిధిలోకి వచ్చిన తర్వాత ఆకారణంగా ఉద్యోగులను తొలగించడం, దొడ్డిదారిన వేరే వారిని నియమిం చుకోవడం ఇక్కడ ఆనవాయితీగా మారిందని విమర్శలు వస్తున్నాయి. గతేడాది ఎలాంటి అనుమతులు లేకుండానే 50కి పైగా ఏసీలను కొనుగోలు చేసేశారు. వాస్తవానికి టెండర్ పిలవాల్సి ఉన్నా గుట్టుచప్పుడు కాకుండా ఒక వ్యక్తికి కట్టబెట్టారు. మార్కెట్లో ఉన్న ధర కంటే ప్రతి ఏసీకి రూ.20 వేలు అదనంగా బిల్లు చెల్లించారు. ఇటువంటివే మరికొన్ని ఉన్నాయన్న ఆరోపణలున్నాయి.

- ప్రస్తుతం ఆస్పత్రిలోని డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ (ఆరోగ్యశ్రీ) విభాగంలో 21 మంది వివిధ రకాల ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరిలో పది మందిని వివిధ రకాల టెక్నీషియన్లు, సపోర్టింగ్ స్టాఫ్‌ను ఈనెల 1వ తేదీ నుంచి గుట్టుచప్పుడు కాకుండా తొలగించేశారు. రాష్ట్రం లో అన్ని ఆస్పత్రుల్లో టెక్నీషియన్లు, సపోర్టింగ్ స్టాఫ్ యథావిధిగానే పని చేస్తున్నారు. ఇక్కడ ఒక వైద్యుడి అత్యుత్సాహంతో వీరిని తొలగించారని వాపోతు న్నారు. డీఈవోలుగా ఉన్న వారిని ఐదుగురిని తొలగించి దొడ్డిదారిన మరో ఐదుగురిని వెంటనే నియమించారు. వాస్తవానికి ఉద్యోగులను తొలగించాలన్న, పోస్టింగులు ఇవ్వా లన్నా ఆస్పత్రి అభివృద్ధి కమిటీలో నిర్ణయాలు తీసుకుని ఆ తర్వాతే టెండర్లు పిలవాలి. కానీ ప్రస్తుతం థర్డ్‌పార్టీ కాంట్రాక్టుగా కొనసాగుతున్న ఒక సంస్థకు వీరే పేర్లు పంపి వారికి అపాయింట్‌మెంట్ లెటర్లు ఇప్పించడం, ఉన్న వారిని తొలగించడం చేస్తున్నారు. ఉద్యోగాలు పోయిన 15 మంది రోడ్డున పడ్డారు. ఒక ఉద్యోగిని తొలగించాలంటే ఆరోపణలు, ఇతర కారణాలు ఉండాలి. ఇక్కడ అలాంటివి లేకపోయినా తొలగించారు. ఆస్పత్రి అభివృద్ధి కమిటీని పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆస్పత్రిని పరిశీలించి హెచ్చరికలు జారీ చేసి వెళ్లారు. అయినా ఇవేమీ తమకు పట్టనట్టుగా అధికారులు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటికైనా జిల్లా ఉన్న తాధికారులు స్పందించి ఆస్పత్రి వ్యవహారాలను గాడిలో పెట్టాలని పలువురు కోరుతున్నారు.

జడ్జిల బదిలీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఏలూరులో అదనపు సివిల్ జడ్జిగా పీఎస్‌వీవీ కృష్ణసాయితేజను నియమిస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీకాకుళం జిల్లా రాజాం సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్)గా పనిచేస్తున్న పీఎస్‌వీవీ కృష్ణసాయితేజను ఏలూరుకు బదిలీ చేశారు. ఏలూరులో అడిషనల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) గా పని చేస్తున్న కేకేవీ బులికృష్ణను ఏలూరులోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్)గా నియమించారు. నిడదవోలులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జిగా పనిచేస్తున్న జి.రామకృష్ణను విశాఖ జిల్లా అనకాపల్లిలోని రెండోవ అదనపు సివిల్ జడ్జిగా నియమించారు.

ఇంటింటా న్యాయసేవా కార్యక్రమాలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):జిల్లా వ్యాప్తంగా ఇంటింటా న్యాయ సేవల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 62 బృందాలు ఇంటింటా తిరుగుతూ బాలల సంక్షేమం, విభిన్న ప్రతిభా వంతుల సౌకర్యాలపై వివరిస్తా యన్నారు.

5,441 మంది హాజరు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్ ఒకేషనల్, జనరల్ ప్రాక్టికల్స్‌కు బుధవారం ఉదయం 3,107 మంది విద్యార్థులకు 2,972 మంది, మధ్యాహ్నం 2,528 మందికి 2,469 మంది విద్యార్థులు హాజరయ్యారని ఆర్ఐవో కె.యోహాన్ తెలిపారు.

దాగుడుమూతలు!



- **ఐదుగురికే డిప్యూటేషన్ల రద్దు.. మిగతావారంతా డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే..**
- **వైసీపీ ప్రభుత్వంనుంచి సీట్లకు అతుక్కుపోయిన 'వారి సేవలు' ఇప్పటికీ అవసరమట!**
- **ఏళ్ల తరబడి పీహెచ్‌సీలను వదిలేసి డీఎంహెచ్‌వోల వద్ద పాగా..**

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వం నాటి నుంచి ఏళ్ల తరబడి అనధికారిక డిప్యూటేషన్లు, ప్రైవేటు ఆస్పత్రులు, స్కానింగ్ సెంటర్లలో మొక్కుబడి తనిఖీలు, కొందరు సిబ్బంది లంచావతారాలుగా మారారన్న ఆరోపణలు, పలువురు పీహెచ్‌సీల మెడికల్ ఆఫీసర్లపై కక్ష సాధింపులు, కార్యాలయంలో పర్యవేక్షణాలోపం.. తదితర అంశాలపై ఇటీవల తరచూ వార్తల్లో నిలుస్తున్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో బుధవారం హఠాత్తుగా నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. వివిధ విభాగాల్లో ప్రక్షాళనదిశగా మార్పులు, చేర్పులు జరిగాయి. ఆ మేరకు డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని బుధవారం పలు కీలక నిర్ణయాలను తీసుకున్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో తీసుకున్న ఈ కొద్దిపాటి ప్రక్షాళన ప్రభావం కొందరిపైనే పడిందని, అసలు ఆయా విభాగాల్లో దీర్ఘకాలంగా సీట్లను అతుక్కుపోయినవారిని ఉదాసీనంగా వదిలేశారనే విమర్శలు ప్రారంభమయ్యాయి. ఆ ప్రకారం పీహెచ్‌సీల్లో బాధ్యతలు నిర్వర్తించాల్సిన మెడికల్ ఆఫీసర్లలో డిప్యూటేషన్లపై డీఎంహెచ్‌వో కార్యాలయంలో నియమిస్తూ పూర్వపు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ఠ గతేడాది జారీచేసిన ఉత్తర్వులను ప్రస్తుత డీఎంహెచ్‌వో డాక్టర్ మాలిని రద్దు చేస్తూ ఆయా బాధ్యతలను ఇన్‌చార్జి హోదాల్లో కొందరికి అప్పగించారు. దీనికనుగుణంగా ఇక మీదట డీఎంహెచ్‌వో కార్యాలయ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసరు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం(ఎఫ్‌డీపీ) నోడల్ ఆఫీసర్ బాధ్యతలను డాక్టర్ ఆర్. రోహిత్‌కు, జాతీయ ఆరోగ్య పథకం డీపీఎంవో, ఉద్యోగుల ముఖగుర్తింపు ఆధారిత హాజరు (ఎఫ్‌డీపీ)నోడల్ ఆఫీసర్ బాధ్యతలను డాక్టర్ కె.భార్గవికి అప్పగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. వీరిద్దరూ ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వం నుంచి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కోసం జిల్లాలో ఎవరైనా డాక్టరు సెలవు పెడితే సంబంధిత రోజుల్లో ప్రత్యామ్నాయంగా ఆయా పీహెచ్‌సీ/గ్రామాల్లో వైద్యసేవలందిం చేందుకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో బఫర్ డాక్టర్ల బృందంలో నియమితులై ఉన్నారు.

ఇప్పటి వరకు కార్యాలయ ఏవో బాధ్యతలతో పాటు, మరో నాలుగు విభాగాల విధులను ఇన్‌చార్జి హోదాలో ఎనిమిది నెలలుగా నిర్వర్తిస్తున్న డాక్టర్ చక్రధర్‌ను పెదపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌గా కొనసాగాలని డీఎంహెచ్‌వో ఆదేశాల్లో పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో కార్యాలయంలోనే డిప్యుటేషన్లపై విధులు నిర్వర్తిస్తున్న మరో నలుగురు ఎంపీహెచ్ఎస్, ఎంపీ హెచ్ ఈవోలు, డీఈవోలను వారి పూర్వపు పని స్థానాల్లో తక్షణమే రిపోర్టు చేయాలని ఆదేశించారు. వీరితోపాటు ఇదే కార్యాలయంలో డిప్యుటేషన్లపై ఆయా విభాగాల్లో మరో 12 మంది కొనసాగుతున్నట్టు గుర్తించినా వీరిలో ఏడుగురిని 'పని సర్దుబాటు' కింద డిప్యుటేషన్లపై కొనసాగిస్తూనే వారానికి మూడు రోజులు సంబంధిత పీహెచ్‌సీలకు వెళ్లి విధులు నిర్వర్తించాలని వెసులుబాటు కల్పిం చారు. మరో ఐదుగురిపై ఏ నిర్ణయం తీసుకోకుండానే కార్యాలయంలోనే కొనసాగేం దుకు వీలు కల్పించారు.

జిల్లా పునర్విభజన కారణంగా ఉమ్మడి జిల్లాకు సంబంధించిన రిక్రూట్ మెంట్లు, సర్వీస్ మేటర్లు ఏలూరు డీఎంహెచ్‌వో కార్యాలయ పరిధిలోనే చూడాల్సి ఉంటుందన్న సాకుతో పలువురు ఉద్యోగుల డిప్యుటేషన్లను రద్దుచేయకుండా కొనసాగింపునకు చర్యలు తీసుకోవడం విమర్శల పాలవుతోంది. వాస్తవానికి జీవో 143, జీవో 32, జిల్లా పునర్విభజనల వల్ల ఏర్పడే కార్యకలాపాలను పర్యవేక్షించడానికి ప్రస్తుతం డీఎంహెచ్‌వో కార్యాలయ పీవోడీటీటీ, మేల్ ట్రైనింగ్ స్కూళ్లలో జూనియర్, సీనియర్ అసిస్టెంట్లు, జీవో 143లో రెండు ఎంపీహెచ్ఈవో, ట్రైనింగ్ స్కూలులో ఒక మెడికల్ ఆఫీసర్ సేవలను వినియోగించుకునే వెసులుబాటు ఉన్నా, ఇంతవరకు శాంక్షన్ పోస్టులు లేని విభాగాల్లో పీహెచ్‌సీల నుంచి ఉద్యోగ సిబ్బందిని డిప్యుటేషన్లపై కొనసాగించడంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. మరోవైపు కొందరికి జారీ చేసిన డిప్యుటేషన్ల వెసులుబాటు ఆర్డర్లలో వారానికి మూడు రోజులపాటు పీహెచ్‌సీలకు వెళ్లి విధులు నిర్వర్తించాలని ఆదేశించినా దీనిపై స్పష్టత ఉత్తర్వుల్లో ఇవ్వకపోవడం మొక్కుబడి ఆదేశాల్లో భాగమేనని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఐదుగురు తప్ప, వైసీపీ ప్రభుత్వం నుంచి పీహెచ్‌సీలను వదిలిపెట్టి డీఎంహెచ్‌వో కార్యాలయంలో తిష్టవేసిన మిగతా 20 మంది కొనసాగేందుకు వీలుగా ప్రక్షాళనను 'మమ' అనిపించారని సమాచారం.



నిప్పుల గుండం తొక్కిన భక్తులు

దెందులూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):గాలాయగూడెం అచ్చమ్మ పేరంటాలమ్మ తల్లి ఆలయంలో నిప్పులగుండం తొక్కేందుకు వేలాది మంది వచ్చారు. అమ్మవారి ఆలయ 68వ వార్షికోత్సవ పూజలు తొమ్మిది రోజులుగా జరుగుతున్నాయి. బుధవారం తెల్లవారుజామున ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ దేవత ప్రతిమతో నిప్పుల గుండం తొక్కి అగ్నిగుండం ప్రవేశం ప్రారంభించారు. సాయంత్రం ఐదు గంటల వరకు వేలాది మంది భక్తులు, సంతానం లేనివారు పెద్దఎత్తున నిప్పుల గుండం తొక్కారు, దెందులూరు పోలీసులు, ఆలయ కమిటీ సభ్యులు తగిన ఏర్పాటు చేశారు.

నేత్ర పర్వం.. నరసింహుని చందనోత్సవం



ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల సుందర గిరిపై స్వయంభూగా విరాజిల్లుతున్న లక్ష్మీ నారసింహుని చందనోత్సవం భక్తులకు నేత్ర పర్వమైంది. చందనం పూతతో ఉగ్ర నారసింహుడు సేద తీరారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా బుధవారం పంచామృత అభిషేకాలు, చందనోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామి అమ్మవార్లను విశేషంగా అలంకరించారు. సాయంత్రం ధ్వజ అవరోహణ చేశారు.



లాంచీపై వెళుతూ పరిశీలిస్తున్న ఎస్పీ కిశోర్, పోలీస్ సిబ్బంది

పట్టిసీమ ఉత్సవాలకు బందోబస్తు పటిష్ఠంగా ఉండాలి

ఏర్పాట్లు పరిశీలించిన ఏలూరు జిల్లా ఎస్పీ ప్రతాప్ శివ కిశోర్

పోలవరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో బందోబస్తు ఏర్పాట్లు పటిష్ఠంగా ఉండాలని ఎస్పీ ప్రతాప్ శివకిశోర్ అన్నారు. బుధవారం ఆయన పట్టిసీమలో ఉత్సవ ఏర్పాట్లు పరిశీలించారు. పట్టిసీమ భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయానికి రాకపోకలు సాగించేందుకు గోదావరిలో ఏర్పాటు చేస్తున్న కాలిబాట ప్రాంతాన్ని ఇసుక డ్రెడ్జింగ్ ప్రాంతం, ఫెర్రీ పాయింట్, ఆలయ ప్రాంగణంలో ఏర్పాట్లు, ఇసుక తిన్నెల్లో చలువ పందిళ్ల ఏర్పాట్లు పరిశీలించారు. భద్రతా ఏర్పాట్ల వివరాలను ఎస్ఐ పవన్ కుమార్ ఎస్పీకి వివరించారు. ఎస్పీ మాట్లాడుతూ పట్టిసీమ మహా శివరాత్రి ఉత్సవాలలో భక్తులు దర్శనం చేసుకుని తిరిగి వెళ్లేవరకూ వారికి పూర్తి రక్షణ కల్పించే విధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డీఎస్పీ ఎం.వెంకటేశ్వర రావు సీఐ బాల సురేష్‌బాబు, ఆలయ ట్రస్టీ వెంకటజగన్నాధరావు, ఆలయ కార్యనిర్వహణాధికారి చాగంటి సురేష్ నాయుడు, వెంకట్రాజు పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అంజిబాబు

బధిరుల టీ-20 క్రికెట్ పోటీలు ప్రారంభం

భీమవరం టౌన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):బధిరులు కూడా సమాజంలో అందరితో సమానమని, వారికి సముచిత స్థానం ఉందని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు(అంజిబాబు) అన్నారు. భీమవరం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో పశ్చిమ గోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 5వ రాష్ట్రస్థాయి బధిరుల (మూగ, చెముడు) టీ-20 క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, కార్యదర్శి సీహెచ్ తాతారావు మాట్లాడుతూ 9 జిల్లాల నుంచి 50 మంది బధిర క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొన్నారని, జోన్-1,2,3 (శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పు పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు) విభాగాల్లో పోటీలు జరుగుతున్నాయని, గురువారం ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు. కళాశాల పాలకవర్గ సభ్యులు కూనపరాజు రామకృష్ణంరాజు, జనసేన పట్టణ అధ్యక్షుడు చెనమల్ల చంద్రశేఖర్, పొత్తూరి బాపిరాజు, కంతేటి వెంకటరాజు, అసోసియేషన్ సభ్యులు రాము, ఎండీ రఫి, రాజు, రామచంద్రరావు, కామేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



నోటి క్యాన్సర్‌పై అవగాహన

ఏలూరులో డెంటల్ కళాశాల విద్యార్థుల ఫ్లాష్ మాబ్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : దంతవైద్యం, శస్త్ర చికిత్సలు, నోటి క్యాన్సర్‌పై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏలూరు సమీపంలోని దుగ్గిరాల సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ పీజీ, యూజీ విద్యార్థులు ఫ్లాష్ మాబ్ నిర్వహించారు. ఏలూరు విజయ్‌విహార్ సెంటర్ సమీపంలోని రిలయన్స్‌మాల్ ఎదురుగా నడిరోడ్డుపై డాన్సులు చేస్తూ అవగాహన కల్పించారు. ఏమేం తింటే క్యాన్సర్ వ్యాధి బారిన పడతామో చెప్తూ చేసిన డాన్సులు అందరినీ ఆకర్షించాయి. కాలేజీ కరస్పాండెంట్ ఫాదర్ మోజెస్ మాట్లాడుతూ సిగరెట్, మత్తుపదార్థాలు, పొగాకు నమలడం వల్ల నోటి క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందని విద్యార్థులు ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రదర్శన చేయడం అభినందనీయమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శివరాజ్ మాట్లాడుతూ వ్యాధులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడమే ఎంతో ఉత్తమమన్నారు.



వడ్డీ రేట్లు తగ్గింపు !



కసరత్తు చేస్తున్న బ్యాంకులు

రుణాల పెంపుదలే ప్రధాన లక్ష్యం

గృహ నిర్మాణదారులకు ఇది శుభవార్తే

రియల్ ఎస్టేట్ వ్యాపారానికి పునర్వైభవం !

పాలకొల్లు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): బ్యాంకు రుణాలపై వడ్డీ రేట్లు తగ్గనున్నాయి. ఈ దిశగా వాణిజ్య బ్యాంకులు కసరత్తు చేస్తున్నాయి. క్రెడిట్ డిమాండ్‌ను అంచనా వేసి రుణాలపై వడ్డీలు తగ్గించి ప్రకటన చేయడానికి మరికొన్ని రోజులు సమయం పట్టే అవకాశం ఉంది. దీనిపై ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని రుణాలు పొందే వారికి ఇది శుభవార్తే. 6.50 శాతంగా రెపో రేటును ఇటీవల రిజర్వు బ్యాంకు త్రైమాసిక సమావేశంలో 0.25 శాతం తగ్గించడంతో 6.25కు చేరింది. కొంత కాలంగా జీడీపీ వృద్ధి రేటు తగ్గడం రుణ పరపతిలో అసమతుల్యత ఏర్పడి గృహ రుణాలపై వడ్డీ రేట్లు పెరుగుతూ వచ్చాయి. పెద్దనోట్ల రద్దు, కొవిడ్ నేపథ్యంలో బ్యాంకులు కొంత మేరకు వ్యాపారాన్ని నష్టపోయాయి. ఈ పరిస్థితుల్లో ఇప్పుడు రిజర్వు బ్యాంకు తీసుకున్న నిర్ణయంతో బ్యాంకుల నుంచి తీసుకునే రుణాలపై వడ్డీ రేట్లు తగ్గుతాయని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు.

పాత రుణాలకు వర్తింపు

ఇప్పటికే బ్యాంకుల నుంచి తీసుకున్న గృహ, ఇతర రుణాలుపై వడ్డీ రేట్లు తగ్గే అవకాశం ఉంది. ఫ్లోటింగ్ వడ్డీ రేట్లపై రుణాలు తీసుకున్న రుణగ్రహీతలకే ఇది వర్తిస్తుందని బ్యాంకింగ్ వర్గాలు చెబుతున్నాయి. ఫిక్స్‌డ్ వడ్డీ అంటే ఉదా హరణకు రుణం తీసుకున్న సమయంలో ఎనిమిది శాతంగా ఉంటే అదే వడ్డీ ఈఎంఐలు పూర్తయ్యే వరకూ వర్తిస్తుంది. ఫ్లోటింగ్ రేటులో రుణాలు పొందితే బ్యాంకుల వడ్డీ పెరిగితే పెరు గుదల వడ్డీ, తగ్గితే తగ్గుదల ఉంటుంది. కాబట్టి ఫ్లోటింగ్ రుణగ్రహీతలకే లబ్ధి కలుగుతుంది.

ఈఎంఐ మారదు

బ్యాంకులు రుణాలపై వడ్డీ రేట్లు తగ్గించి నప్పటికీ రుణగ్రహీతలు నెల నెలా చెల్లించే కిస్తీలలో ఏ విధమైన మార్పు ఉండదని బ్యాంకు అధికారులు చెబుతున్నారు. నెల నెలా చెల్లించే ఈఎంఐ మొత్తంలో తగ్గించిన మేరకు వడ్డీ మినహాయించి మిగిలిన మొత్తం అసలులో జమ చేస్తారు. రుణ చెల్లింపులు పూర్తయ్యే సమయంలో ఈఎంఐ తగ్గుతాయి. రెపో రేటు తగ్గించడంతో బ్యాంకులు వడ్డీ రేట్లను తగ్గిస్తా యని, దీనితో గృహ రుణాలు పెరుగుతాయని అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఇసుక లభ్యత మెరుగు పడటం, భవన నిర్మాణ సామగ్రి అందుబాటు ధరలలో ఉండటం, బ్యాంకులలో వడ్డీ రేట్లు తగ్గే అవకాశాలు ఉండటంతో నిర్మాణ రంగం ఊపందుకుంటుందని పరిశీల కులు అంచనా వేస్తున్నారు.

పశ్చిమలో రుణగ్రహీతలు

పశ్చిమ గోదావరిలో బ్యాంకుల ద్వారా 60,249 మంది రూ.1,241.24 కోట్ల వ్యక్తిగత రుణాలు తీసుకున్నారు. ప్రాధాన్యత రంగంలో 5,120 మంది రూ.106.29 కోట్లు గృహ రుణా లుగా పొందారు. కమర్షియల్, అపా ర్టుమెంట్‌లు రియల్‌ఎస్టేట్, ఇండస్ట్రీయల్ తదితర విభాగాల్లో 10,076 మంది రూ.677.01 కోట్ల రుణాలు తీసుకున్నట్లు లీడ్ బ్యాంకు మేనేజర్ నాగేంద్రబాబు తెలిపారు.



స్టాక్ మార్కెట్‌కు ట్రంప్ షాక్‌లు

20 రోజులుగా మార్కెట్ పతనం

జిల్లావాసుల పెట్టుబడులు రూ.100 కోట్లపైనే ఆవిరి

ఆందోళనలో మదుపుదారులు

నరసాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అగ్రరాజ్యం అమెరికా వెళ్లి ఉన్నత విద్యను అభ్యసించి అక్కడ ఉద్యోగం చేయాలని కలలు గన్న జిల్లా వాసుల ఆశల్ని ట్రంప్ అడియాశలు చేశారు. ఆయన తీసుకున్న నిర్ణయాలతో అమెరికా వెళ్లిన చాలామంది తిరిగి వెనక్కు రావాల్సిన పరిస్థితి నెలకొంది. ఇంతటితో ట్రంప్ ప్రభావం ఆగలేదు.. ఆయన తీసుకుంటున్న నిర్ణయాలు, జారీ చేస్తున్న ఉత్తర్వులు , విధిస్తున్న సుంకాల దెబ్బకు జిల్లాలోని మదుపుదారులు పెట్టుబడులు రోజురోజుకు ఆవిరైపోతున్నాయి. స్టాక్ మార్కెట్ ఇండెక్స్ రోజు రోజుకు కిందకు దిగితుండటంతో మదుపు దారుల పెట్టుబడులన్నీ కరిగి పోతున్నాయి. గడిచిన 20 రోజుల్లో జిల్లావాసుల పెట్టుబడులు దాదాపు రూ.100 కోట్లుపైనే పతనమైనట్లు అంచనా.. దీంతో చాలా మంది ఇన్వెస్టర్లు అయినకాడికి అమ్ముకుని నష్టాలను మూట కట్టుకుంటు న్నారు. రాష్ట్రంలోనే స్టాక్ మార్కెట్ పెట్టుబడుల్లో జిల్లా అగ్రగామిగా నిలిచింది. గడిచిన నాలుగేళ్ల నుంచి మార్కెట్ దూసుకు పోతుండటంతో జిల్లావాసులు మంచి లాభాలను చవిచూశారు. బ్యాంకు వడ్డీలు తగ్గడం, రియల్ ఎస్టేట్, ఇతర రంగాలు కుదేలవ్వడంతో సామాన్య, మధ్య తరగతితో పాటు ఉద్యోగులు మార్కెట్‌లో పెట్టుబడులు పెడుతూ వచ్చారు.దానికి తగ్గట్టుగానే లాభాలను రుచి చూశారు. కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం తీసు కుంటున్న నిర్ణయాలు పారిశ్రామిక రంగాన్ని మరింత ముందుకు తీసుకెళతాయన్న నమ్మకంతో అన్ని రంగాల షేర్లను కొంటూ వచ్చారు. అత్యధికంగా భీమవరం, నరసాపురం, పాలకొల్లు, తణుకు, టీపీ గూడెం, పెనుగొండ, ఆకివీడు తదితర ప్రాంతాలకు చెందిన ఎక్కువ మదుపు దారులు మార్కెట్‌లో పెట్టుబడులు పెట్టారు.

ట్రంప్ రాకతో భారీపతనం

నాలుగు నెలల నుంచి తీవ్ర ఒడిదుడుకులు చూస్తు వస్తున్న స్టాక్ మార్కెట్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తరువాత ఎక్కువ స్థాయిలో పతనమైంది. గడిచిన 20 రోజుల నుంచి ఇండెక్స్ సూచిక రెడ్‌మార్క్‌నే చూపిస్తూ పతనమయ్యాయి. దీంతో మదుపుదారులు భారీగా నష్టపోయారు. ఏక్షణంలో ట్రంప్ ఏ నిర్ణయం తీసుకుంటారో అన్న భయం మదుపుదారుల్లో నెలకొంది. దీంతో రానున్న రోజుల్లో మార్కెట్ మరింత పతనం అవుతుందన్న భయంతో కొందరు మదుపుదారులు అయినకాడికి అమ్మకాలకు దిగారు. మరికొందరు నష్టాలను మూటగట్టుకోలేక వేచిచూచే దోరణిలో పడ్డారు.



దివ్యాంగులకు రైల్వే గుడ్‌న్యూస్

ఆన్‌లైన్‌లోనే పాస్‌లకు దరఖాస్తు

నరసాపురం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):దివ్యాంగులు రైల్వేపాస్ పొందాలంటే ఇప్పటి వరకు అనేక వ్యయ ప్రయాసలు పడాల్సి వచ్చేది. జిల్లా కేంద్రం, లేదా ప్రధానస్టేషన్‌కు వెళ్లి దరఖాస్తు చేసు కోవాల్సిందే. వీటిని పరిశీలించిన తరువాత ఎప్పటికో పాస్ జారీ అయ్యేది. మళ్లీ దీని కోసం ప్రత్యేకంగా వెళ్లాల్సి వచ్చేది. దివ్యాంగులు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన రైల్వేశాఖ వారికి ఈ ఏడాది తీపికబురు చెప్పింది. ఇంట్లో లేదా మీసేవ కేంద్రాల్లో నేరుగా రైల్వేపాస్‌కు దరఖాస్తు చేసుకునే విధంగా కొత్త స్టాఫ్ వేర్‌ను తీసుకొచ్చింది. ఇందుకు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీపీ దివ్యాంగ జనిధి ఇండియన్ రైల్వే జీవోవీఎస్ వెబ్‌సైట్‌లోకి నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇందులోనే యూనిక్ డిజెబులిటీ ఐడీ కార్డు మంజూరు చేస్తారు.కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు ముందుగా తన పేరు, ఆధార్, సెల్ నెంబర్ ఎంటర్ చేసి రిజిస్టర్ చేసుకోవాలి.లాగిన్ అయిన తరువాత వచ్చిన ఓటీపీ నెంబర్‌ను ఎంటర్ చేస్తే సరిపోతుంది.



వివరాలన్నీ పొందపర్చిన తరువాత వీటిని రైల్వే అధికారులు పరిశీలించి పాస్ జారీ చేస్తారు. ప్రస్తుతం జిల్లాలో 27 వేల మంది పైనే దివ్యాంగులు ఉన్నారు. వీరిలో 30 శాతం మంది కూడా పాస్‌లు తీసుకోవడం లేదు.

కళల రారాజు



భీముని పాత్రలో హనుమంతురావు

ఎందరో మహానుభావులు.. అందరికి వందనాలు అన్నారు పెద్దలు.. పల్లెటూర్లలో పుట్టి దేశవ్యాప్తంగా ఖ్యాతి చాటిన మహనీయులు ఎంతో మంది ఉన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడు మండలం బోడపాడు గ్రామానికి చెందిన సరస్వతుల హనుమంతురావు ఆ కోవలోకే వస్తారు. కళలపై ఉండే అభిమానంతో చిన్ననాటి నుంచి చదువుతోపాటు మృదంగం, ఘటం (కుండపై వాయిద్యం)లపై పట్టు సాధించారు. ఇప్పటి వరకూ ఎన్నో ప్రదర్శనలు ఇచ్చారు. మరెన్నో అవార్డులు పురస్కారాలు అందుకున్నారు. అంతేకాదు.. ఏకపాత్రాభినయంలో విభిన్నమైన పౌరాణిక పాత్రలు వేసి మెప్పించారు. అంతర్జాతీయ కళాకారుడిగా పేరు గడించారు. తన జీవితం కళలకే అంకితం అంటున్న హనుమంతురావు కళాప్రస్థానంపై ప్రత్యేక కథనం..

30 ఏళ్లుగా కళలతోనే జీవితం

మృదంగ కళాకారునిగా వేల ప్రదర్శనలు

అంతర్జాతీయంగా గుర్తింపు

ఏకపాత్రాభినయంలో అద్భుత ప్రతిభ

కళా సేవకుడు హనుమంతురావు

పెంటపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి)

హనుమంతురావు 1965 జూన్ ఐదో తేదీన పెంటపాడు మండలం బోడపాడులో జన్మించారు. తండ్రి సరస్వతుల వెంకటేశ్వర్లు(బుచ్చన్న). ఈయన బోడపాడు గ్రామానికి 15 సంవత్సరాలపాటు సర్పంచ్‌గా పనిచేశారు. తల్లి వెంకటరమణమ్మ. ఈమెకు కూడా సంగీతం, సాహిత్యం అంటే ఎంతో ఇష్టం. అంతే కాదు అందులో కొంత ప్రావీణ్యం కూడా ఉంది. అదే హను మంతురావు కళల పట్ల ఆకర్షితుడు అయ్యేలా చేసింది. బీఏ వరకూ చదువుకున్న ఈయన చిన్ననాటి నుంచే చదువుతో పాటూ కళారంగంపై కూడా ఆసక్తి కనబరుస్తూ వచ్చారు. అదే ఆసక్తితో టాప్ గ్రేడ్ మృదంగ విద్వాంసుడు, ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్ మహదేవ్ లక్ష్మీనారాయణరాజు వద్ద శిష్యుడిగా చేరి తన కళకు సాన పెట్టుకున్నారు. మృదంగంలో డిప్లమో చేశారు. ఘట వాయిద్యంలో సత్తా చాటుకున్నారు. హనుమంతురావు అన్న రామ నర్సింహం కూడా కార్టునిస్టుగా పనిచేస్తున్నారు.

ఏకపాత్రాభినయంలో దిట్ట

హనుమంతురావు ఒక సంగీత విద్వాంసునిగానే కాదు. ఏక పాత్రాభినయంతో ప్రశంసలు అందుకున్నారు. రామాంజనేయ యుద్ధంలో ఆంజనేయ పాత్ర అంటే ఎంతో ఇష్టం. ఆంజనేయుడి పాత్రలో ఎంతో మందిని మెప్పించిన ఈయన అభినవ ఆంజనేయ అనే బిరుదు కూడా కైవసం చేసుకున్నారు. ధుర్యోధనుడు, భీముడు, యముడు, లక్షణుడు, నక్షత్రకుడు తదితర పాత్రలో ఏకపాత్రాభినేయం చేసి ఆ పాత్రలకు ప్రాణం పోశారు.





నా జీవితం కళకే అంకితం

చిన్నతనం నుంచే కళల పట్ల ఎంతో ఆసక్తి ఉండేది. అందుకే చదువుతో పాటూ మృదగం, ఘటం వాయిద్యాలలో పట్టు సాధించాను. ఇప్పటి వరకు దేశ విదేశాలలో వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చాను. జన్మనిచ్చిన తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతో పాటు నేను పుట్టి పెరిగిన గ్రామ ప్రజలందరూ నా ప్రతీ విజయంలోనూ వెన్నుదన్నుగా నిలిచారు. నా జీవితం కళలకే అంకితం. అవకాశం ఉన్నంత వరకూ కళామ్మ తల్లికి సేవ చేస్తూనే ఉంటాను.

- సరస్వతుల హనుమంతురావు

వేలసంఖ్యలో ప్రదర్శనలు

సుమారు 30 సంవత్సరాల నుంచి కళారంగంలో ఉన్న హను మంతురావు ఇప్పటివరకూ దేశ వ్యాప్తంగా వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఎంతో మందిని మెప్పించారు. ఎన్నో అవార్డులు, సన్మాన పత్రాలను అందుకున్నారు. సంవత్సరాల కాలం నుంచి ఆనేక దేవాలయాలలో, ధార్మిక సంస్థలలో, ఆల్ ఇండియా రేడి యోలో హిందూధర్మ పరిరక్షణ కోసం అన్నమాచార్య, పురందర దాసు కీర్తలను గానం చేశారు. తిరుపతి, అన్నవరం, భద్రాచలం వంటి ప్రముఖ ఆలయాల్లో ప్రదర్శలు ఇచ్చారు. మార్ధాంగిక విభూషణ, ఘటవాద్యరత్న, గాంధర్వపుష్పం వంటి బిరుదులు సాధించడమే కాకుండా కంచి ఆస్థాన విద్వాంసుడిగా గుర్తింపు సాధించారు.

అయోధ్యలో ఘట వాయిద్య ప్రదర్శన

అయోధ్య ప్రాణప్రతిష్ఠ సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీ సమక్షంలో తెలుగు ఉభయ రాష్ట్రాల తరఫున ఏకైక ఘట వాయిద్య కళాకారుడిగా హనుమంతురావుకు ఆహ్వానం అందింది. అయోధ్య రామ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమంలో తన ఘట వాద్య కళను ప్రదర్శించి అందరి మన్ననలను అందుకున్నారు.

కళా దిగ్గజాలతో కచేరీలు

మంగళంపల్లి బాలమురళీకృష్ణ, నూకల చిన్నసత్యనారాయణ, నేదునూరి కృష్ణమూర్తి, టీఎన్ శేషగోపాలన్, టీవీ శంకరనారాయణ తదితరులతో కచేరీలు ఇచ్చారు. అనేక హరికథలోనూ, లలిత సంగీత కార్యక్రమాలు, 20 సంవత్సరాలుగా టీడీపీ నాదనీరాజనం తదితర కార్యక్రమాలో ఆయన పాలు పంచుకున్నారు

విదేశాలలో ప్రదర్శనలు

హనుమంతురావు స్వదేశంలోనే కాదు..విదేశాలలో కూడా తన ప్రతిభ కనపర్చారు. ఇప్పటివరకు దుబాయ్, మస్కట్, రష్యా, వెస్టిండీస్, కజకిస్తాన్ తదితర దేశాలలో తన ప్రదర్శనలు ఇచ్చి మెప్పించారు. ఇటీవల శ్రీలంకలో ఒక ప్రదర్శనకు వెళ్లారు.



శ్రీలంకలో ఒక ప్రదర్శనలో..



సాధించిన అవార్డులు

మా గ్రామానికే గర్వకారణం



హనుమంతురావు వల్ల మా గ్రామానికి ఎంతో పేరు వచ్చింది. చిన్న గ్రామంలో పుట్టి దేశ , విదేశాలలో వేల సంఖ్యలో ప్రదర్శనలు ఇచ్చారు. ఇటువంటి వ్యక్తి మా గ్రామంలో ఉండటం మా అందరికి గర్వకారణం. ఈయన ఇంకా ఎన్నో ప్రదర్శలు ఇవ్వాలి.

- పెనుమజ్జి హనుమంతురావు, బోడపాడు

శిష్యులను సిద్ధం చేస్తున్నారు



తన ప్రదర్శనలతో బోడపాడు గ్రామానికే వన్నె తెచ్చిన మహోన్నత వ్యక్తి మా గురువుగారు హను మంతురావు. తనతో పాటూ గ్రామంలో అనేక మంది శిష్యులను కూడా సిద్ధం చేశారు. కళల పట్ల ప్రతీ ఒక్కరికి ఆసక్తి కలిగేలా చేస్తున్నారు. ఆయన ప్రదర్శనలలో శిష్యులను కూడా భాగస్వామ్యం చేస్తున్నారు.

- ఆకుల నరిసింహారావు, శిష్యుడు, బోడపాడు



ఎల్.అభినవ్,ప్రశాంత్‌కుమార్,సాయివర్షిత్, షణ్ముఖ చౌదరి తనవ్‌ఆర్య, నారాయణనీరజ్, కె.త్రిశంకు

జేఈఈ మెయిన్స్‌లో సత్తా చాటిన విద్యార్థులు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): తొలివిడత జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో ఏలూరు నగరానికి చెందిన పలువురు విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఉత్తమ పర్సంటైల్‌తో నేరుగా ఐఐటీ అడ్వాన్స్ పరీక్షకు అర్హత సాధించారు. నారాయణ జూనియర్ కళాశాలకు చెందిన లంక అభినవ్ 99.3366 పర్సంటైల్, ఏ.ప్రశాంత్‌కుమార్ 99.3250 పర్సంటైల్‌తో టాపర్లుగా నిలిచారు. డి.అబిరామ్, కె.సోహిత్, ఎస్.కిరణ్మయి, కె.టైటస్, జి.చరణ్‌తేజ, సర్దార్ త్రిలోచన్ సింగ్ ఉత్తమ పర్సంటైల్ సాధించారని కళాశాల డీన్ రమేష్ తెలిపారు. ఎస్ఆర్ఐ జూనియర్ కళాశాలకు చెందిన వి.సాయివర్షిత్ 99.10 పర్సంటైల్, వై.భాను కార్తికేయ 98.50, ఎం.కాశీనాగవిష్ణు 98.00, పి.సత్యసాహితి 97.53, పర్సంటైల్ సాధించారని కళాశాల సీఈవో వి.తులసీరామ్ తెలిపారు. ఎన్ఆర్ పేటలోని చైతన్య కళాశాలకు చెందిన జి.షణ్ముఖచౌదరి 99.31 పర్సంటైల్, కె.తనవ్ ఆర్య 98.62, నారాయణ నీరజ్ 98.05, కె.త్రి శంకు 98.04 పర్సంటైల్‌తో టాపర్లుగా నిలిచారని కళాశాల డీన్ రాంబాబు తెలిపారు.

భీమవరం రూరల్ : జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో భీమవరంలోని తమ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలను కనబరిచారని తిరుమల విద్యాసంస్థల ఛైర్మన్ నున్న తిరుమలరావు తెలిపారు. విద్యార్థి పిజె హర్షవర్ధన్ 99.76 పర్సంటైల్‌తో మొదటిస్థానాన్ని కైవసం చేసుకోగా, సుమారు 95 మంది విద్యార్థులు అత్యుత్తమ పర్సంటైల్ సాధించినట్టు తెలిపారు. పిజె హర్షవర్ధన్ 99.76 పర్సంటైల్, ఏ.శివకార్తీక్ 99.74, జి.నిఖిల్‌వర్మ 99.64, కె.శివ 99.54, వివిఎల్ఎస్‌కె కార్తీక్ 99.31, జిజిఎన్ఎం శ్రీవెంకట్ 99.18, ఎం.సాయిచరణ్ 99.03 పర్సం టైల్ సాధించారని తెలిపారు.99.5 పర్సంటైల్‌గా నలుగురు, 99 పర్సంటైల్ ఏడుగురు, 98 పర్సం టైల్‌గా 17 మంది, 95 పర్సంటైల్ పైగా 43 మంది, సాధించారని తెలిపారు.

ప్రతిభ చూపిన సాత్విక



ద్వారకాతిరుమల, 12 (ఆంధ్రజ్యోతి) : ద్వార కాతిరుమల మండలంలో పి.కన్నాపురం ఎంపీపీ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న వైరాధాకుమారి కుమార్తె బ్లెస్సీ సాత్విక జేఈఈ మెయిన్స్‌లో 99.308 పర్సంటైల్ సాధించింది. ఏలూరుకి చెందిన సాత్విక విజయవాడ శ్రీచైతన్య కళా శాలలో ఇంటర్ చదివింది.



డ్రాయింగ్‌లో అప్పనవీడు విద్యార్థులకు బంగారు పతకాలు

పెదపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : నెల్లూరులో జరిగిన ఆల్ ఇండియా చిల్డ్రన్స్ ఆర్ట్ కాంపిటీషన్, అమీర్ ఆర్ట్ అకాడమీ చిత్రకళల పోటీల్లో పెదపాడు మండలం అప్పనవీడు హైస్కూల్ విద్యార్థినులు ఏడు బంగారు పతకాలు సాధించినట్లు హెచ్.ఎం తోట పుష్పావతి తెలిపారు. జీవన్ సాకేత్ (6వ తరగతి), జ్యోతిర్మయి (7వ తర గతి), గేయశ్రీదుర్గ, కావ్య (8వ తరగతి), సౌజన్య, సాయి వెంకటగణేష్ (9వ తరగతి), సీహెచ్ అక్షయ (10వ తరగతి)లను ఎంఈవోలు నరసింహమూర్తి, వెంకటరమణ అభినందించారు. వీరితో పాటు 47 మంది విద్యార్థులకు మెరిట్ సర్టిఫికెట్లు లభించినట్టు డ్రాయింగ్ మాస్టారు రజనీకాంత్ తెలిపారు.

డెల్టా కాలువలకు 8,850 క్యూసెక్కుల విడుదల

ధవళేశ్వరం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి):వ్యవసాయ అవసరాల కోసం కాటన్ బ్యారేజ్ నుంచి డెల్టా కాలువలకు బుధవారం 8,850 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. తూర్పు డెల్టా ప్రధాన పంట కాలువకు 2,650 క్యూసెక్కులు, మధ్య డెల్టా ప్రధాన పంట కాలువకు 1,800 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4,400 క్యూసెక్కులు చొప్పున జలాలు విడుదల చేస్తున్నారు.

గోదావరిలో నీటి లభ్యత 8,309 క్యూసెక్కులుగా ఉండగా నీటి మట్టం 9.60 అడుగులుగా నమోదైంది.

1,035 పోస్టులతో మెగా డీఎస్సీ



ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్ సిద్ధం

తీరనున్న నిరుద్యోగుల కలలు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) :కూటమి ప్రభుత్వం కొలువుతీరాక ముఖ్యమంత్రి చంద్రబాబు తొలి సంతకం చేసిన మెగా డీఎస్సీ ఉపాధ్యాయ నియామకాల నోటిఫికేషన్ జారీ అయ్యేందుకు రంగం సిద్ధమవుతోంది. ఉపాధ్యాయ రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి ప్రాథమిక అర్హతలైన ఇప్పటికే టెట్ పరీక్ష, ఫలితాల ప్రకటన పూర్తయిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో నియామకాల నోటిఫికేషన్ కోసం నిరుద్యోగ ఉపాధ్యాయ అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. సుప్రీంకోర్టు తీర్పుతో ఎస్సీ వర్గీకరణ అనంతరం మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్ నోటిఫికేషన్ జారీచేసేందుకు ప్రభుత్వం నిర్ణయించగా, ఆ మేరకు ఎస్సీ వర్గీకరణపై సిఫారసుల నిమిత్తం నియమించిన ఏకసభ్య కమిషన్ త్వరలో తన నివేదికను ప్రభుత్వానికి అందజేయనుంది. దీంతో మార్చినెలలో డీఎస్సీ నోటిఫికేషన్‌ను విడుదల చేయడానికి మార్గం సుగమమైంది. సార్వత్రిక ఎన్నికలకు ముందు జగన్ ప్రభుత్వం విడుదల చేయతలపెట్టిన డీఎస్సీలో ఉమ్మడి జిల్లాలో కేవలం 228 ఉపాధ్యాయ పోస్టులను మాత్రమే నోటిపై చేయాలని నిర్ణయించగా, ఈ పోస్టుల సంఖ్యను పెంచుతామని ఎన్నికల ప్రచారంలో హామీఇచ్చిన కూటమి ప్రభుత్వం ఆ మేరకు మాటను నిలబెట్టుకుంటూ ఉపాధ్యాయ పోస్టులసంఖ్యను ఏకంగా 1035కి పెంచింది. దీనికనుగుణంగానే మెగా డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల కానుంది. రాత పరీక్షల షెడ్యూల్ మార్చిలో, పరీక్షలు ఏప్రిల్ లేదా మేనెలలో, ఫలితాలు జూన్‌లో విడుదల చేసి, నియామకాలను వేసవిసెలవులుముగిసి పాఠశాలలు పునఃప్రారంభమయ్యేలోగా అంటే జూన్ 12లోగా పూర్తిచేసే అవకాశం ఉంది.

ఉమ్మడి జిల్లాలో నియామకాలు ఇలా..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో మొత్తం 1035 ఉపాధ్యాయ పోస్టులను నోటిపై చేయనున్నారు. ప్రభుత్వ/ స్థానికసంస్థల యాజమాన్యాల పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్‌కేడర్‌లో తెలుగు 35 పోస్టులు, హిందీ 45, ఇంగ్లీషు 79, గణితం (తెలుగు మీడియం) 37, ఫిజికల్ సైన్సు (తెలుగు) 38, బయోలాజికల్ సైన్సు (తెలుగు) 58, సోషల్ స్టడీస్ (తెలుగు) 91, ఫిజికల్ ఎడ్యుకేషన్ 179, ఎస్జీటీ (తెలుగు) 260లలో మొత్తం 822 పోస్టులు నోటిపై చేయనున్నారు. మున్సిపల్ యాజమాన్యం, ఏలూరు నగరపాలక సంస్థ పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ కేడర్ తెలుగు 11, 3 పోస్టులు, హిందీ 2, 1, ఇంగ్లీషు 5, 1, గణితం 6, 2, ఫిజికల్ సైన్సు 4, బయోలాజికల్ సైన్సు 1, సోషల్ స్టడీస్ 9, 2, ఫిజికల్ ఎడ్యుకేషన్ 6, ఎస్జీటీ (తెలుగు) కేడర్‌లో 121, 36, ఎస్జీటీ ఉర్దూ మీడియంలో 3 పోస్టులు భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులను సవరించిన రిజర్వేషన్ నిబంధనల ప్రకారం మెరిట్ ఆధారంగా నియామకాలను చేపడతారు. పోస్టుల సంఖ్య, రిజర్వేషన్ నిబంధనలపై ఇంతవరకు జిల్లా విద్యాశాఖ నుంచి అధికారిక ప్రకటన లేదు.



కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, పాల్గొన్న ఎన్నికల పరిశీలకురాలు సునీత..
బ్యాలెట్ బాక్సుల నిర్వహణపై పోలింగ్ సిబ్బందికి శిక్షణ

నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలి

పీవో, ఏపీవోల శిక్షణలో కలెక్టర్

ఏలూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులను నిష్పక్షపాతంగా, నిబంధనల ప్రకారం నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత, జేసీ ధాత్రిరెడ్డిలతో కలిసి 27న తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ విధులు నిర్వహించే పీవో, ఏపీవోలకు తొలి విడత శిక్షణా తరగతులను బుధవారం నిర్వహించారు. బ్యాలెట్ బాక్సు ఆపరేటింగ్, బ్యాలెట్ పేపర్ల పరిశీలన, పీవో డైరీ నిర్వహణ ముఖ్య ఘట్టాలని వెట్రిసెల్వి వివరించారు. గత ఎన్నికల్లో అనుభవాన్ని జోడించి సజావుగా పోలింగ్ ప్రక్రియను నిర్వహించాలన్నారు. మాస్టర్ ట్రైనీ శ్రీనివాస్ ఫణి పీవోలు, ఏపీవోలతో ఓటు వేసే విధానంపై, పోలింగ్ సిబ్బంది నియామకం, పోలింగ్ మెటీరియల్స్, ఎన్నికల సామగ్రి తనిఖీ, పోలింగ్ కేంద్రానికి చేరిన వెంటనే చేయాల్సిన విధులను వివరించారు. డీఆర్వో విశ్వేశ్వరరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో భీమేశ్వర్, ఏలూరు ఆర్డీవో అచ్యుత అంబరీష్ పాల్గొన్నారు.

తూర్పు-పశ్చిమ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ నామినేషన్ల ఉపసంహరణ తొలి రోజు బుధవారం ఎవరూ ఉపసంహరించుకోలేదు. 43 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఈ నెల 13వ తేదీ గురువారంతో ముగియనుంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక బరిలో నిలిచిన అభ్యర్థులకు గుర్తులను కేటాయించనున్నారు.

నామినేషన్ ప్రక్రియలో రాజకీయం

రాజమహేంద్రవరం సిటీ : ఎమ్మెల్సీ ఎన్నికల్లో వేసిన నామినేషన్ల స్క్రూటినీలో తొలుత వీర రాఘవరావు డిస్ క్వాలిఫై అయ్యాడని ప్రకటించి, చివర్లో క్వాలిఫై అయ్యారని చెప్పడంపై అమలాపురం మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ అభ్యంతరం వ్యక్తం చేశారు. రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోటీలో ఉన్న తన కుమారుడు సుందర్‌కి, వీర రాఘవరావుకు మధ్య ఓట్లు చీల్చడం కోసమే చేశారని ఆరోపించారు.

విద్యార్థినుల పట్ల అసభ్య ప్రవర్తన.. ఉపాధ్యాయుడి సస్పెన్షన్

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థినులపై అసభ్యకర ప్రవర్తనకు పాల్పడుతున్నట్టుగా ఓ ఉపాధ్యాయునిపై వచ్చిన ఆరోపణలపై స్కూలు హెచ్ఎం, ఎంఈవో, డీవైఈవోలు నిర్వహించిన విచారణలో రుజువుకావడంతో ఏలూరు రూరల్ మండలం సత్రంపాడు జడ్పీ హైస్కూలులో సోషల్‌స్టడీస్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సాల్మన్‌రాజును సస్పెండ్ చేస్తున్నట్టు డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం రాత్రి తెలిపారు. గుడ్ టచ్ - బ్యాడ్ టచ్‌పై పాఠశాలల విద్యార్థినులకు అభయ మహిళా రక్షక బృందం కొద్ది రోజులుగా అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో సత్రంపాడు జడ్పీ హైస్కూలులో అవగాహన కార్యక్రమానికి వెళ్ళినపుడు రెండు సెక్షన్ల విద్యార్థినులు తమపట్ల ఉపాధ్యాయుడు అభ్యంతర కరంగా వ్యవ హరిస్తున్న విషయాన్ని మహిళా పోలీసులకు తెలియజేశారు. స్కూలు హెచ్ఎంకు విద్యార్థినులు తెలియజేస్తున్నా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లలేదని సమాచారం. ఇదే విష యమై స్థానిక మహిళా పోలీసుస్టేషన్ ఎస్సై డీఈవో కార్యాలయానికి వచ్చి విద్యాధికారికి వివరించారు. ఈ నేపథ్యంలో బుధవారం ఉదయం స్కూలుకు రాగానే టీచరును ఓ గదిలోపెట్టి తాళం వేసినట్టు సమాచారం. ఉద్రిక్తత కొన సాగుతున్న క్రమంలోనే డీఈవో వెంకట లక్ష్మమ్మ ఆదేశాల మేరకు బుధవారం మధ్యాహ్నం హెచ్ఎం శ్రీనివాసరావు, ఎంఈవో డి.వి.రమణ, డీవైఈవో రవిప్రకాష్, మహిళా పోలీసు ఎస్సై మరోదఫా విచారణ నిర్వ హించగా, విద్యార్థినులపై అసభ్యకర ప్రవర్తన నిజమేనని నిర్ధారణైంది. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయుడు సాల్మన్ రాజును సస్పెండ్ చేస్తున్నట్టు డీఈవో తెలిపారు. సాల్మన్‌రాజు మరో ఏడాదిన్నర కాలంలో ఉద్యోగ విరమణ చేయనుండగా, ఓ ప్రముఖ ఉపాధ్యాయ సంఘానికి రాష్ట్ర కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు.

ఉపాధ్యాయుడిపై కేసు నమోదు

ఏలూరు క్రైం : దీనిపై ప్రాథమికంగా విచారణ జరిపిన పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం అతనిని అరెస్టు చేయనున్నట్లు సమాచారం. మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.సుబ్బారావు ఆధ్వర్యంలో ఎస్ఐ కాంతి ప్రియ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దేవ స్కూల్ ఉపాధ్యాయుడు వేధింపులపై విచారణ

పెనుగొండ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం దేవ హైస్కూలులో విద్యార్థినులను ఒక ఉపాధ్యాయుడు వేధింపులకు గురిచేస్తున్నాడని ఆంధ్ర విద్యార్థి సంఘం ఫిర్యాదు మేరకు అధికారులు విచారణ చేపట్టినట్లు తెలిపారు. నరసాపురం డివిజన్ ఉప ప్రణాళిక అధికారి డి. మురళి సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పెనుగొండ సీఐ రాయుడు విజయ కుమార్, ఎస్ఐలతో కలిసి బుధవారం పాఠశాలలో విచారణ చేసినట్టు తెలిపారు. ఉపాధ్యాయుడు కొంతదురుసుగా వ్యవహరిస్తాడని తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. భవిష్యత్తులో అలా వ్యవహరించకుండా రాత పూర్వకంగా లెటర్ తీసుకుని ఉన్నతాధికారులకు నివేదించినట్లు తెలిపారు.



విచారణకు వచ్చిన అధికారులు

చేపల మేత, మందుల షాపుల్లో తనిఖీలు

రూ.2,20,93,413 విలువ చేసే చేపల మేత, మందులు సీజ్



తనిఖీ చేస్తున్న అధికారులు

భీమవరం క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): భీమవరం మండలం చినఅమిరం గ్రామంలో చేపల మేత, చేపల మందుల షాపుల్లో విజిలెన్స్, మత్స్యశాఖ, రెవెన్యూ అధికారులు తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్లు పి.శివరామకృష్ణ, డి.ప్రసాద్‌కుమార్ తెలిపిన వివరాలు ప్రకారం.. శివసాయి ఆక్వా ఫీడ్స్‌లో ఫిషరీస్ లైసెన్స్ లేకుండా చేపల మేత, చేపల మందులు అమ్మకాలు గుర్తించి రూ.1,88,97,176 విలువ కలిగిన 180.925 టన్నుల చేపల మేత, చేపల మందులు సీజ్ చేసినట్టు తెలిపారు. శ్రీ సాయి పవన్ ఆక్వా ఫీడ్స్‌లో ఎటువంటి ఫిషరీస్ లైసెన్స్ లేకుండా చేపల మేతలు, చేపల మందుల అమ్మకాలు గుర్తించి రూ. 31,96,237 విలువ కలిగిన 19.269 టన్నుల చేపల మేత, మందులు సీజ్ చేసినట్టు తెలిపారు. ఏవో జి.మీరయ్య, విజిలెన్స్ ఎస్ఐ సిహెచ్.రంజిత్‌కుమార్, మత్స్యశాఖ అధికారులు ఏడి, భీమవరం సీహెచ్.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డివో పి.లావణ్య, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. ఆధీకృత ఫిషరీస్ లైసెన్స్‌లు లేకుండా ఎవరైనా చేపల మేతలు, చేపల మందులు వ్యాపారం నిర్వహిస్తే దాడులు చేసి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

క్షతగాత్రులకు మొదటి గంట గోల్డెర్ అవర్: ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మొదటి గంటలో చికిత్స అందిస్తే ప్రాణాలను కాపాడగలమని ఏలూరు జిల్లా ఎస్పీ కె ప్రతాప్ శివకిశోర్ అన్నారు. జాతీ య రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగ ంగా ఉపరవాణా కమిషరు కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రక్తదానం శిబిరాన్ని ఎస్పీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మొదటి గంట సమయం చాలా ముఖ్యమైనదని, దీనిని గోల్డెన్ అవర్ అంటారన్నారు. ఆ సమయంలో చికిత్స అందిస్తే ప్రాణాలు రక్షించవచ్చని, క్షతగాత్రున్ని వెంటనే ఆసుపత్రికి తీసుకు వెళ్ళిన వారిపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎటువంటి కేసు నమోదు చేయమన్నారు. ప్రాణాలను రక్షించిన వారికి రివార్డులు అందించడం జరుగుతుందని ఎస్పీ చెప్పారు. తదనంతరం డీటీసీ కార్యాలయ ఆవరణంలో ఉపరవాణా కమిషనర్ షేక్ కరీమ్, ఆర్టీవోలు కెఎస్ఎం కృష్ణారావు, ఎండి మదాని, డీఎస్పీ శ్రావణ్‌కుమార్, ఏలూరు రూరల్ ఎస్బి సీఐలుతో కలిసి ఆయన మొక్కలు నాటారు.

స్పీకర్ అయన్నపాత్రుడి వ్యాఖ్యలపై గిరిజనుల ఫిర్యాదు

జీలుగుమిల్లి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): స్పీకర్ అయ్యన్నపాత్రుడు షెడ్యూల్ ప్రాంత చట్టాలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ ఆదివాసీలను కించపరుస్తూ మాట్లాడటంపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చెయ్యాలని గిరిజన సంఘాల నాయకులు కోరారు. గిరిజన ప్రాంతంలో ప్రత్యేక ఉద్యోగ చట్టం తేవాలన్నారు. జీలుగుమిల్లి పోలీస్ స్టేషన్‌లో స్పీకర్‌పై కేసు నమోదు చెయ్యాలని ఫిర్యాదు చేశారు. అనంతరం తహసీల్దారు కార్యాల యంలో సీనియర్ అసిస్టెంట్ ఎస్‌వి.రమణకు తమ సమస్యలు ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లాలని వినతిపత్రం ఇచ్చారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షుడు పూనెం వెంకటేశ్వరావు, మడకం రమేష్, పండు జగదీష్, పండు ప్రసాద్, తెల్లం ప్రసాద్, తెల్లం రాంబాబు పాల్గొన్నారు.

మద్యం దారి తప్పింది..!



ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్న మద్యం సరఫరా చేస్తున్న వ్యాను

ఏలూరు క్రైం/కుక్కునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో కొంత మంది మద్యం వ్యాపారులు అక్రమంగా తమ వ్యాపారాన్ని మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లింప చేసుకోవడానికి రకరకాల మార్గాలను ఎంచుకుంటున్నారు. ఏలూరు జిల్లాలో ఇద్దరు వ్యాపారులు ఏకంగా ఒక మారుతీ వ్యాను పెట్టి వారే స్వయంగా ఇంటింటికి పాలు సప్లై చేసినట్టుగా మద్యాన్ని విక్రయిస్తున్నారంటే ఇంక ఏవిధంగా వీరు వ్యాపారం చేస్తున్నారో అర్థం చేసుకోవచ్చు. కొన్ని వీధులకు కేసుల మద్యాన్ని సరఫరా చేస్తున్నారు. **డోర్ డెలివరీ చేస్తున్న వీడియో సోషల్ మీడియాలో మంగళవారం వైరల్‌గా మారింది.** మొత్తం మీద ఉన్నతాధికారులకు సమాచారం అందడంతో వారి ఆదేశాల మేరకు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.ఆవులయ్య పర్యవేక్షణలో ప్రత్యేక బృందాలు రంగంలోకి దిగాయి. ఏజెన్సీలోని కుక్కునూరు మండలంలో ఈ వ్యాను వ్యాపారం కొనసాగుతుందని గుర్తించారు. ఆ వ్యానును స్వాధీనం చేసుకున్నారు. **వ్యాన్‌లో ఉప్పేరు మద్యంషాపు నుంచి మద్యం సరఫరా చేస్తున్న చిన్ని రవికుమార్‌ను అరెస్టు**

ఇంటింటికి సరఫరా చేస్తున్న వ్యక్తులపై దాడులు.. అరెస్ట్

చేయడానికి ప్రయ త్నించారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి వాహనాన్ని వదిలి తప్పించుకున్నాడు. అతని కోసం గాలింపు చర్యలు చేపడుతున్న ఎక్సైజ్ సిబ్బంది తెలిపారు. దాడుల్లో పట్టుబడిన బ డుగు నాగేశ్వరరావు నుంచి 12 మద్యం సీసాలు, నంద్రు నరేష్ నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేశారు.

బెల్ట్‌షాపులపై దాడులు

పెదవేగి మండలంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారనే సమాచారంతో దాడి చేసి వేగివాడలో ఒక షాపు నిర్వాహకుడిపై కేసు నమోదు చేశారు. అతను ఏకంగా తమ పరిధిలో ఉన్న గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారని గుర్తించారు. ఉంగుటూరు మండలం నారాయణపురంలో ఒక వ్యక్తి బెల్టుషాపు నిర్వహిస్తుండగా ఆ వ్యక్తిని అరెస్టు చేసి అతనికి మద్యం సరఫరా చేసిన షాపు యజమానిపై కేసు నమోదు చేశారు. షాపుల వద్దే లూజు విక్రయాలు జరుపుతున్న ఏలూరులోని ఒక షాపు, భీమడోలులోని ఒక షాపుపై కేసులు నమోదు చేశారు.

ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

పెంటపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్ర జ్యోతి) : రోడ్డు మలుపు తిరుగుతున్న క్రమంలో ద్విచక్రవాహనదారుడిని టాటా ఏస్ వాహనం ఢీ కొట్టిన సంఘటన బుధవారం ప్రత్తిపాడు గ్రామంలో చోటు చేసుకున్నది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ప్రత్తిపాడు గ్రామానికి చెందిన బలగం మాసరయ్య తన దిచక్రవాహనం నుంచి ప్రత్తిపాడు -అలంపురం రహదారి వైపుకు వస్తుండంగా తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలు వైపుకు వెళ్తున్న టాటా ఏస్ వాహనం ఇతన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో మాసరయ్యకు గాయాలు కాగా స్థానికులు ఇతడిని తణుకు ఆసుపత్రికి తరలించారు.

638 సెల్‌ఫోన్లు.. బాధితులకు అందజేత



రికవరి చేసిన సెల్‌ఫోన్‌ను బాధిత దివ్యాంగుడికి అందిస్తున్న ఎస్పీ కేపీఎస్ కిశోర్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మొబైల్స్ పోగొట్టుకున్న వారివి 14వ సారి రికవరీ చేసి అందరికీ తామే స్వయంగా అందిస్తున్నామని జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ చెప్పారు. సెల్‌ఫోన్లను బాధితులకు అందించే కార్యక్రమాన్ని ఏలూరు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించారు. ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై స్వయంగా ఫోన్లను వృద్ధులు, దివ్యాంగుల వద్దకు వెళ్ళి అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ కిశోర్ మాట్లాడుతూ 14వ సారి తాము రికవరీ చేసిన ఫోన్లు 638 మొబైల్స్ అని, వీటి విలువ రూ.76 లక్షల 56 వేలు అన్నారు. ఈ ఫోన్లను ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్ జిల్లా, అంబేద్కర్ కోనసీమ, విశాఖపట్నం, తూర్పుగోదావరి, విజయనగరం, తెలంగాణా, కేరళ, మహారాష్ట్ర, తమిళనాడు తదితర ప్రదేశాల్లో వినియోగిస్తున్న వారి నుంచి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో రెండు వేల 398 ఫోన్లను రికవరీ చేశామని వాటి విలువ నాలుగు కోట్ల 6 లక్షల 39 వేల 684 రూపాయలు విలువ అని చెప్పారు. ఎవరైనా దొంగ ఫోన్లు కొనుగోలు చేసినా, విక్రయించినా ఆ ఫోన్లు వాడినా వారిపై సెక్షన్ 317 భారతీయ న్యాయ సంహిత 2023 చట్ట ప్రకారం మూడు సంవత్సరాలు జైలు శిక్ష అనుభవించాల్సి ఉంటుందని వివరించారు. ప్రజలు తమ వస్తువులను జాగ్రత్తగా చూసుకోవాలన్నారు. ఎవరైనా అనుచిత వీడియో కాల్స్ కాని, రకరకాల కాల్స్ చేసినా భయపడవద్దని వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. అనుమానిత లింకులను ఓపెన్ చేయవద్దన్నారు. ఎవరైనా ఫోన్లు పోగొట్టుకుంటే సమీప పోలీస్ స్టేషన్‌లో సీఇఐఆర్ పోర్టల్ ద్వారా వెంటనే రిపోర్టు చేయాలని సూచించారు. దొంగిలించబడిన ఫోన్లు రికవరీ ప్రయత్నాలు వేగవంతం చేయడానికి సీఇఐఆర్ పోర్టల్ సహాయ పడుతుందని వివరించారు.

సెకండ్ హ్యాండ్ ఫోన్లు కొనేటప్పుడు ఖచ్చితంగా అందుకు సంబంధించిన బిల్లులు చూసుకోవాలని సూచించారు. జిల్లాలో ఎక్కువగా సెకండ్ హ్యాండ్ ఫోన్లను అమ్మిన తరువాత అవి దొంగ ఫోన్లుగా నిర్ధారణ జరిగిన షాపు నిర్వాహకులపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఎస్పీ ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ ఎన్ సూర్యచంద్రరావు, ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్, ఏలూరు సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ రాజశేఖర్, ఏలూరు వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, త్రి టౌన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ పలువురు పాల్గొన్నారు.

క్రైమ్ కార్నర్



రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పెంటపాడు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందాడు. నిడమర్రు మండలం అడవికొలనుకు చెందిన నిమ్మల రాము(28) పనినిమిత్తం తాడేపల్లిగూడెం వచ్చిన ఇతను గణపవరం వెళ్తుండంగా పెంటపాడు కాలేజ్ సెంటర్ సమీపంలో ఇతని ముందు వెళ్తున్న లారీ ఎదుట ఒక వ్యక్తి బియ్యం మూట పాడేయడంతో డ్రైవర్ తన లారీని స్లో చేశాడు. లారీ వెనుక ఉన్న రాము తప్పించే క్రమంలో వెనుక వచ్చిన మరో లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో రాము తీవ్ర గాయాలతో సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. మృతుని తండ్రి త్రిమూర్తులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ స్వామి తెలిపారు

రెండేళ్ల క్రితమే వివాహం

ప్రమాదంలో మృతిచెందిన రాముకు రెండు సంవత్సరాల క్రితమే వివాహమైనట్లు స్థానికులు తెలిపారు. ప్రస్తుతం ఇతని భార్య 6 నెలల గర్భిణీ. ఒక్కగాని ఒక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.



ఎస్ఐ కారు దగ్ధం

తాడేపల్లిగూడెం రూరల్ ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):తాడేపల్లిగూడెం తాలూకా కార్యాలయ సమీపంలో తెల్లవారు జామున ఓ కారు కాలి బూడిదైంది. కియా కంపెనీకి చెందిన ఈ కారు తాడేపల్లిగూడెం పట్టణ ఎస్సైకి చెందినది. ఈ కారును ఎవరైనా దుండగులు తగలబెట్టారా లేక షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిందా అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



కేకు కట్ చేస్తున్న ఎమ్మెల్యే సతీమణి మీన

ఘనంగా ఎమ్మెల్యే బడేటి చంటి జన్మదిన వేడుకలు

ఏలూరు టూటౌన్/ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య(చంటి) జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే చంటి సతీమణి మీన కేకు కట్ చేశారు. పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. వీటితో పాటు అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారు. 50డివిజన్స్‌లో జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి స్థానికంగా లేకపోవడంతో ఆయన సతీమణి మీన కేకును కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. సుమారు 9వేలమంది మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఎంసీఏ చదువుతున్న గాయిత్రీ అనే విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందించారు. పాఠశాలలకు 3వాటర్ డిస్పెన్సరీలను అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో దివంగత నేత బడేటి బుజ్జి సతీమణి రేణుక, కోఆప్షన్‌సభ్యులు చోడే వెంకటరత్నం, టీడీపీ సీనియర్ నాయకులు చల్లా వెంకటసత్య వరప్రసాదరావు, డిప్యూటీ మేయర్లు పప్పు ఉమామహేశ్వరరావు, వందనాల దుర్గాభవాని శ్రీనివాస్, టీడీపీ నగర అధ్యక్షకార్యదర్శులు శివప్రసాద్, రెడ్డి నాగరాజు, ఎం.పార్థసారథి, మారం హనుమంతరావు, దాసరి ఆంజనేయులు కడియాల విజయలక్ష్మి, ఎంబీఎస్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

16వ డివిజన్ టీడీపీ యువనాయకులు కలపాల రామ్‌కుమార్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు నిర్వహించారు. వంగాయిగూడెంలోని మదర్ థెరిస్సా ఫౌండేషన్‌లో తలదాచుకుంటున్న వృద్ధ మహిళలకు అన్నదానం, ఆ డివిజన్‌లో మహిళలకు చీరలు పంపిణీ, అంగన్‌వాడీ సెంటర్లో చిన్నారులకు పలకలు, బిస్కెట్లు, పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఏలూరు మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ పూజారి నిరంజన్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమంలో కొత్తపల్లి రాజు, నిడిగట్టి సుధీర్, జశ్వంత్, మణి, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చంటి కృతజ్ఞతలు

ప్రచార మాధ్యమాల ద్వారా తనకు స్వయంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారికి ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. తనపై ఎంతో ప్రేమ చూపిస్తూ ఊరులో లేకపోయినా పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిపిన కార్యకర్తలు, నాయకులు, అభిమానులకు రుణపడి ఉంటానని అన్నారు. ఇది పూర్వజన్మ శుకృతంగా భావిస్తున్నానని అన్నారు.

గిరిజన పట్టా భూముల్లో స్తంభాల ఏర్పాటు

గిరిజనుల ఆందోళన



తమ భూముల పట్టాలు చూపుతున్న గిరిజనులు

ఏలూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) : పోలవరం మండలం సున్నాలగండి ఏజెన్సీ గ్రామంలో గిరిజనుల పట్టా భూముల్లో అటవీశాఖ సిబ్బంది సరిహద్దు స్తంభాలు ఏర్పాటు చేస్తుండడంతో బుధవారం ఆ గ్రామ గిరిజనులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు తమ భూములు స్వాధీనం చేసుకుంటున్నారనే భయాందోళలనతో తమ పట్టాదారు పాసు పుస్తకాలతో గ్రామంలో ఆందోళన చేశారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన అటవీశాఖ వింజరం డీఆర్వో బీఎస్ మీనాక్షి మాట్లాడుతూ శాటిలైట్ సర్వే కోసం రిజర్వు అటవీ ప్రాంతంలో ఉన్న సున్నాల గండి గ్రామం చుట్టూ ఉన్న రిజర్వు అటవీ భూములకు 10 ప్రాంతాల్లో సరిహద్దు సూచికల ఏర్పాటు పనులు ప్రారంభించామన్నారు. ఈ క్రమంలో సూచికల సరిహద్దులలో ఉన్న గ్రామస్థులకు చెందిన 35 ఎకరాల పట్టా భూముల సరిహద్దులలో సూచికల ఏర్పాటు కోసం కాంక్రీటు స్తంభాలు ఏర్పాటు చేయడం జరిగిందని ఈ విషయంలో సంబంధిత భూముల రైతులు అపోహలకు గురై ఆందోళన చెందారని తెలిపారు. వారి భూములకు గానీ వారి పంటలకు గానీ ఎలాంటి ఆటంకం ఉండదని తెలిపారు. దీంతో విషయం తెలుసుకున్న గిరిజనులు శాంతించారు.

ఆటో చార్జీలు అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు

ఏలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆటో చార్జీలు అదనంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తప్పవని జంగారెడ్డిగూడెం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఎస్.రంగనాయకులు హెచ్చరించారు. బుధవారం రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా పోలవరం పంచాయతీ ఆవరణలో ఆటో యూనియన్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రమాదాలు వేగ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాలలో వేగంగా వాహనాలు నడిపినా, ఆటో చార్జీలు అదనంగా వసూలు చేసినా, అధిక లోడు వేసినా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సహాయ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బాబు, ఆటో యూనియన్ నాయకులు వీరన్న, సభ్యులు పాల్గొన్నారు.

సామూహికంగా ఎలుకలు నిర్మూలించాలి

పెదపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రైతులంతా సామూహిక ఎలుకల నిర్మూలన చేపట్టాలని పెదపాడు మండల వ్యవసాయాధికారి వి.ప్రదీప్‌కుమార్ తెలిపారు. కొత్తూరు, అప్పనవీడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం జరిగింది. అనంతరం ఎలుకల మందు తయారీ, వినియోగంపై అవగాహన కల్పించి రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు సత్యనారాయణ, అనంత్ పాల్గొన్నారు.

భీమడోలు: ప్రభుత్వం రైతులకు అందజేస్తున్న పథకాలను సద్వినియోగపర్చుకుని వరిసాగులో అధిక దిగుబడులు సాధించాలని భీమడోలు మండల వ్యవసాయ శాఖ అధికారిణి ఉషారాణి సూచించారు. బుధవారం భీమడోలు మండలంలోని రైతు సేవా కేంద్రాల పరిధిలో రైతులందరికీ ఉచితంగా ఎలుకల నివారణ మందును పంపిణీ చేశారు.

రహదారులు అభివృద్ధి చేయండి

చింతలపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ అభ్యర్థి రాజశేఖరం గెలుపు కోసం నియోజకవర్గ జనసేన నాయకులు, కార్యకర్తలతో ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ బుధవారం క్యాంపు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. నియోజకవర్గంలో ఇంకా కొన్ని చోట్ల రోడ్ల గోతులు పూడ్చలేదని, రహదారులు మరింత అభివృద్ధి చేయాలని, సంక్షేమ ఫలాలు అందరికీ అందేలా సమీక్షించాలని, జనసేనకు నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత, సముచిత స్థానం కల్పించాలని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ మేకా ఈశ్వరయ్య సమావేశంలో ఎమ్మెల్యే రోషన్‌కుమార్ దృష్టికి తెచ్చారు. మండలాల వారీగా జరుగుతున్న అభివృద్ధి తీరుపై సమీక్షించారు.

క్లాప్ డ్రైవర్లకు వేతన బకాయిలు చెల్లించాలి

ఏలూరు టూటౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్లాప్ ఆటోడ్రైవర్లను విధుల్లోకి తీసుకుని వేతన బకాయిలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ఆటోడ్రైవర్లు ధర్నా నిర్వహించి అనంతరం భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ మూడు నెలలుగా జీతాలులేక ఆటోడ్రైవర్లు ఆకలితో అలమటిస్తున్నారని అన్నారు. క్లాప్‌ఆటోడ్రైవర్లను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపి, ఏ.జాన్‌బాబు, గణేష్, రాజు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను విస్మరిస్తే ఊరుకోం

కొయ్యలగూడెం, ఫిబ్రవరి12 (ఆంధ్రజ్యోతి): వృద్ధాప్యంలో తల్లిదండ్రులను ఇబ్బందిపెడితే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి వారికి న్యాయం జరిగేలా చూస్తామని రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యదర్శి కుక్కునూరి రామచంద్రరావు అన్నారు. ఈ మేరకు బుధవారం కొయ్యలగూడెంలో నెరుసు వెంకటరత్నం అనే వృద్ధురాలిని కొడుకు ఇంట్లో ఆశ్రయం ఇవ్వడంలేదని తమ దృష్టికి రావడంతో తామంతా కొయ్యలగూడెం వచ్చామని తెలిపారు. ఈమెను గత రెండురోజులుగా ఇంటిలోనికి రానివ్వకుండా కొడుకు, కోడలు అడ్డుకుంటున్నారని ఆమె పైగా పక్షవాత బాధితురాలని తెలిపారు. బాధితురాలి సమస్యలను ఆర్‌డీఓ దృష్టికి తీసుకెళ్ళి ఆమెకు న్యాయం చేస్తామన్నారు. అసోసియేషన్ నాయకులు ఆంజనేయశర్మ, వెంకట్రెడ్డి, త్రినాధరావు, పాల్గొన్నారు.

పాఠశాలలో ఎంఈవో రికార్డుల తనిఖీ

భీమడోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు మండలం జెఎంఎంపురం ఎంపీపీ పాఠశాలలో ఎంఈవో శ్రీనివాసరావు పాఠశాలను సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ పరీక్షలకు సంబంధించిన హాల్‌టిక్కెట్లను, ప్రోగ్రస్ రిపోర్టులను అందజేయడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.



టెన్త్ పరీక్షలకు తర్ఫీదు

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
ఉత్తమ ఫలితాలు రాబట్టటమే లక్ష్యం

లింగపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే టెన్త్ పబ్లిక్ పరీక్షలలో నూరుశాతం ఫలితాలు సాధించేందుకు విద్యార్థులను సంసిద్ధం చేస్తున్నారు. విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం రెండు గంటలు, సాయంత్రం రెండు గంటలు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రతి సబ్జెక్ట్‌కు సంబంధిత ఉపాధ్యాయులతో అంతర్గత పరీక్షలు నిర్వహిస్తూ పబ్లిక్ పరీక్షలలో తప్పిదాలు, కొట్టివేతలు లేకుండా పరీక్షలు రాసేందుకు, మంచి ఫలితాలు సాధించేందుకు తర్ఫీదు ఇస్తున్నారు. పదవ తరగతి సిలబస్‌ను గత డిసెంబరులోనే పూర్తి చేశామని జనవరి నుంచి మళ్లీ సిలబస్‌ను రివిజన్ చేస్తున్నామని ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రతిరోజూ ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్న సమయంలో వారు ఇబ్బంది పడకుండా వారికి స్నాక్స్, మంచినీరు అందిస్తున్నారు. మండలంలో ఎనిమిది ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలల్లో 392 మంది, ప్రైవేట్ పాఠశాలల్లో 231 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు.

ఉత్తీర్ణతకు ప్రత్యేక శ్రద్ధ

కంతా రామారావు, ఎంఈవో



ఉత్తమ ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నాం. ప్రభుత్వ పాఠశాలల్లో 392 మంది విద్యార్థులు పరీక్షలకు సిద్ధమవుతున్నారు. ఈసారి మండలంలో విద్యార్థులు గతం కంటే మంచి ఫలితాలు సాధించాలని కోరుకుంటున్నాం.

అర్థమయ్యే రీతిలో బోధన

ఎం.నాగవిజయలక్ష్మి, విద్యార్థిని,



పాఠశాలలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిసున్నారు. అన్ని సబ్జెక్టల ఉపాధ్యాయులు మాకు అర్థమయ్యే రీతిలో పాఠాలు చెబుతున్నారు. అంతర్గత పరీక్షలు నిర్వహిస్తూ డౌట్స్ ఉంటే వాటిని నివృత్తి చేస్తున్నారు. తప్పకుండా నూరుశాతం ఫలితాలు సాధిస్తాం.

శ్రీవారికి ఎన్నికల పరిశీలకుల పూజలు

ద్వారకాతిరుమల 12 (ఆంధ్రజ్యోతి): చిన వెంకన్న ఆలయాన్ని గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల పరిశీలకులు దూళి రంగనాయకులు బుధవారం సందర్శించారు. ముందుగా స్వామి, అమ్మవారిని సందర్శించి పూజలు నిర్వహించారు. అనంతరం దొరసానిపాడు, జి కొత్తపల్లి, ఐఎస్ రాఘవాపురం గ్రామాల్లో కూటమి ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

అన్నప్రసాద వితరణ

కామవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక భద్రకాళీ సహిత వీరభద్రస్వామి ఆలయం వద్ద జరుగుతున్న స్వామి వారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం వీరభద్రస్వామి అన్నదాన కమిటీ, ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో భక్తులకు మహా అన్నప్రసాద వితరణను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకుని భక్తి సంకీర్తనలు ఆలపించి భజనలు నిర్వహించి తీర్థ అన్నప్రసాదాలు స్వీకరించారు.

సర్టిఫికెట్‌లు అందచేత

కామవరపుకోట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): తపన ఫౌండేషన్ ద్వారా కామవరపుకోట మండలంలోని కొల్లివారిగూడెం, జీలకర్రగూడెం, కొండగూడెం గ్రామాల్లో కుట్టు శిక్షణ పూర్తి చేసిన 150 మంది మహిళలకు బుధవారం శిక్షణా కేంద్రంలో సర్టిఫికెట్‌లు అందచేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు బి.బాలవర్ధిరాజు, తపన ఫౌండేషన్ ప్రతినిధులు టి.గణేష్ పాల్గొన్నారు.

బడ్జెట్ అంకెల గారడి

కొయ్యలగూడెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపు విషయంలో అంకెల గారడిగా ఉందని సీపీఐ కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య విమర్శించారు. ఈ మేరకు బుధవారం పట్టణంలో సీపీఐ కార్యాలయం వద్ద జరిగిన విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని నిర్వాసితులకు నష్టపరి హారాన్ని సత్వరం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

మహిళ అకాల మరణం..నేత్రదానం




ఏలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పోలవరం గ్రామానికి చెందిన పసుపులేటి అనిత (32) మంగళ వారం గుండె పోటుతో రాజమహేంద్రవరంలో చికిత్స పొందుతూ మృతి చెందింది. ఆమె బంధువులు రాజమహేంద్రవరం రాధా కృష్ణ ఐ బ్యాంకుకి సమాచారం ఇవ్వడంతో వైద్య సిబ్బంది వచ్చి మృతదేహం కార్నియాలను సేకరించారు. మరణంలో సైతం నేత్రదానం చేయడం పట్ల గామ స్థులు ఆమె కుటుంబీకులను అభినం దించారు.

నాయకులంతా కలిసి పని చెయ్యాలి

లింగపాలెం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలో నాయకులంతా కలసికట్టుగా పనిచెయ్యాలని మండలాన్ని అభివృదిలో ముందుకు తీసుకువెళ్లాలని చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ అన్నారు. మంగళవారం రాత్రి లింగపాలెం మండల దళితనాయకులతో సమావేశం నిర్వహించారు. సమస్యలను అడిగి తెలుసు కున్నారు. సమస్యలను పరిష్కరించేలా అధికారులు స్థానిక నాయకులతో కలిసి పనిచెయ్యాలని అన్నారు.

కామవరంలో గిరిజన జాతర



బుట్టాయగూడెం, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): కోర్సవారిగూడెం పంచాయతీ కామవరంలో వర్సవారి ఇంటి ఇలవేల్పు గద్దె రాజులు, దుర్గమ్మతల్లి, గుబ్బల మంగమ్మతల్లి, నాగదుర్గాదేవి అమ్మవార్ల మాఘ శుద్ధ పౌర్ణమి గిరిజన జాతర బుధ వారం అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఐదు రోజుల పాటు జరిగే జాతరకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల కోసం చలువ పందిళ్ళు ఏర్పాటు చేశారు. అమ్మవార్లకు, స్వామివారికి పూలతో ప్రత్యేక అలంకరణలు చేశారు. అమ్మవార్లకు సమర్పించడానికి జల కుండలను ఏర్పాటు చేశారు. గిరిజన కళాకారులు డోలు, తలపాగ కొమ్ములు, చిల్లకా యలతో తయారుచేసిన గుత్తులతో వస్తువులతో ఆడిపాడుతూ నృత్యాలతో జాతరకు వన్నెతెచ్చారు.

మహనీయుడు ఘంటసాల

ఘంటసాలకు పలువురి నివాళి



ఘంటసాల విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):అమరగాయకులు ఘంటసాల అని అతను మరణించినా ప్రజల హృదయాల్లో నేటికి చిరస్థాయిగా నిలిచే ఉంటారని, జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు అన్నారు. ఘంటసాల వర్ధంతి సందర్భంగా స్థానిక రామకృష్ణాపురం సాహిత్యమండలి ప్రాంగణంలో ఉన్న ఘంటసాల విగ్రహానికి ఘంటసాల సంగీత కళాశాల అధ్యక్షురాలు వి.రేవతి, పెదపాటి రామకృష్ణ, పుల్లాబోట్ల పురుషోత్తమరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. లంకా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఘంటసాల పాడిన గీతాలు ఇప్పటికి ప్రజల హృదయాల్లో నిలిచే ఉన్నాయని, మహనీయుడు ఘంటసాల విగ్రహాలను ప్రతి జిల్లాలో ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. హేలాపురి కళాకారుల సంఘం అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో గాయకులు శ్రీహరికోటి, ఆచారి, శ్రీనివాస్, ఘంటసాల గానం చేసిన గీతాలను శ్రావ్యంగా ఆలపించారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థికి మద్దతుగా ప్రచారం

ఏలూరు,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి బలపరచిన అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరానికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరుతూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యామ్‌చంద్రశేషు బుధవారం మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఉదయాన్నే షటిల్ ఆడుతూ యువకులకు ఎన్నికల ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురు యువకులు అడిగిన ప్రశ్నలకు శేషు సమాధానం ఇచ్చారు.

కూటమి నాయకుల ప్రచారం

ఉంగుటూరు, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి): జిల్లా టి.డి.పి.అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు ఆదేశాల మేరకు ఎమ్మెల్సీ అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం తరపున ఆయా విద్యా సంస్థలలో కూటమి నాయకులు విస్తృత ప్రచారం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు గోలి శ్రీనివాసరావు, ఐ.టి.డి.పి.నాయకురాలు యెగ్గిన శ్యామల, గురువెల్లి రాజారావు, ఎస్సీ సెల్ నాయకులు నేకూరి ఆశీర్వాదం, అడపా శోభారాణి, ఆలపాటి గిరీష్ పాల్గొన్నారు.

జేఈఈ ఫలితాల్లో విద్యావికాస్ విద్యార్థుల ప్రతిభ



ఏలూరు,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో జంగారెడ్డిగూడెం విద్యావికాస్ జూనియర్ కళాశాల విద్యార్థులు విజయదుందుభి మోగించారని సెక్రటరీ, కరస్పాండెంట్ పి.సతీష్‌చంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కె.వంశీ 98.63 పర్సంటైల్, జి.లిఖిత్ 95.18, జి.జ్యోతి శ్రీనివాస్ 93.47, వై.అమృత 93.04, వి.అభినవ్ 92.76, పి.హర్షిత 92.62, కె.సిరి శృతి 91.56, వి.మణికంఠ 90.32, పి.దేదీప్య 90.31 పర్సంటైల్ సాధిం చారని తెలిపారు. 120 మంది పరీక్షకు హాజరు కాగా వారిలో 90 పర్సంటైల్ పైబడి తొమ్మిది మంది, 80 పైబడి 22 మంది విద్యార్థులు జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారన్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం పి.సతీష్ చంద్, వి.శ్రీనివాస్, ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థును అభినందించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు వి.ప్రసన్నలక్ష్మి, పి.లక్ష్మి,అధ్యాపకులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే కొల్లేరు ప్రజలకు న్యాయం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొల్లేరు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని కొల్లేరు సీనియర్ నాయకులు శ్రీపత్రు, టీడీపీ నాయకులు సైదు గోవర్ధన్ అన్నారు. బుధవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొల్లేరు ఆపరేషన్ తరువాత కొల్లేరు ప్రజలకు గత తెలుగుదేశం ప్రభుత్వం మాత్రమే మేలు చేసిందన్నారు. వైసీపీ ప్రభుత్వం కొల్లేరు ప్రజలను మోసగించిందన్నారు. కాంటూరు కుదిస్తామని మాయమాటలు జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారన్నారు. కూటమి ప్రభుత్వం మీదే కొల్లేరు ప్రజలు ఆశలు పెట్టుకున్నారన్నారు. 5వ కాంటూరు నుంచి మూడో కాంటూరుకు కుదించి కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. గతంలో జీవనోపాధికై చెరువులు తవ్వుతున్నారని వారికి సాయం అందించాలని, వేటకు వెళ్ళే ప్రజలకు సముద్ర వేట నిషేధం సమయంలో ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయం కొల్లేరులోని మత్స్యకార రైతులకు అందించాలని విజ్ఞప్తి చేశారు.

వృద్ధుల ఆరోగ్యానికి పరిశుభ్రత ముఖ్యం



వృద్ధులతో మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్న ప్రసాద్

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : వసతి గృహ పరిసర ప్రాంతాల్లో డ్రెయినేజీ వ్యవస్థ మరింత మెరుగుపర్చాలని వృద్ధుల ఆరోగ్యం విషయంలో పరిశుభ్రత ఎంతో ముఖ్యమని జిల్లా న్యాయసేవాధికార కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. ఏలూరు పత్తేబాదలో ఉన్న పట్టణ నిరాశ్రయుల వసతి గృహాన్ని బుధవారం సాయంత్రం కార్యదర్శి రత్న ప్రసాద్ సందర్శించారు. అక్కడ వృద్ధులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారితో మాట్లాడుతూ నిరాదరణకు గురైన వృద్ధులకు వారి పిల్లల నుంచి భరణి ఇప్పించడం జరుగుతుందన్నారు. పిల్లల పేరున రాసిన ఆస్తులు ఏమైనా ఉంటే వాటిని తిరిగి తీసుకోవచ్చునని సూచించారు. న్యాయసహాయం కోసం 151 00కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు నని తెలిపారు. ఈ వసతి గృహ మేనేజర్ తుమ్మలపల్లి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

వేసవిలో నీటి ఎద్దడి నివారణ చర్యలు

యు.సురేష్ బాబు, డీఈఈ, ఆర్‌డబ్ల్యుఎస్, జంగారెడ్డిగూడెం



- **జంగారెడ్డిగూడెం సబ్ డివిజన్‌లో ఎన్ని మండలాలున్నాయి?**

జవాబు: 5 మండలా లున్నాయి. జంగారెడ్డిగూడెం, కామవరపుకోట, ద్వారకా తిరుమల, లింగపాలెం, చింతలపూడి

- **సబ్ డివిజన్ పరిధిలో జలజీవన్ మిషన్‌కు ప్రస్తుతం ప్రోగ్రెస్‌లో ఉన్న పనులు ఎన్ని..ఎంత బడ్జెట్?**

జవాబు: రూ.ఐదు కోట్ల ముప్పై ఐదు లక్షల బడ్జెట్ తో పనులు జరుగుతున్నాయి. జంగారెడ్డిగూడెంలో 10, కామవరపుకోటలో 5, లింగపాలెంలో2, చింతలపూడిలో 10 పనులు ప్రోగ్రెస్‌లో ఉన్నాయి.

- **సబ్ డివిజన్ పరిధిలో ఎన్ని గృహాలకు కుళాయిలు అమర్చి మంచి నీటి సౌకర్యం కల్పించారు?**

జవాబు: జంగారెడ్డిగూడెంలో మొత్తం 83027 గృహాలున్నాయి. వీటిలో 79176 గృహాలకు కుళాయిలు అమర్చాం. ఇంకా 3851 గృహాలకు మంచినీటి కుళాయిలు అమర్చవలసి ఉంది. సబ్ డివిజన్ పరిధిలోని ప్రతి ఇంటికీ ఉచితంగా కుళాయిలు వేస్తున్నాం. పెండింగ్‌లో ఉన్న వాటిని కూడా త్వరలో పూర్తి చేస్తాం

- **వేసవిలో నీటి ఎద్దడి లేకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?**

జవాబు: గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని బోర్లు ఎండిపోతే రైతుల వద్ద నుంచి బోర్‌వెల్ అద్దెకు తీసుకుంటాం. ఫిబ్రవరి రెండవ వారం నుంచి క్రాష్ ప్రోగ్రాంలో భాగంగా పనిచేయని బోర్లను రిపేరు చేస్తాం.

- ఆంధ్రజ్యోతి-ఏలూరు

భీమడోలులో జాతర

భీమడోలు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : భీమడోలు గ్రామంలో జాతర మహోత్సవం ఘనంగా జరుగుతోంది. బుధవారం గ్రామంలోని మానసా స్కూలు ఏరియా, హంసమేడ, సొసైటీ బ్యాంకు సమీపంలోని పలు ప్రాంతాల్లో పోతురాజుబాబు, గంగానమ్మ, శ్రీమహాలక్ష్మి, మద్దిరావమ్మ అమ్మవార్లను మేళతాళాలతో ఊరేగింపు నిర్వహించారు.

దివ్యాంగుల పించన్లు తనిఖీ

టి.నరసాపురం, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి):మండలంలో 57 మంది దివ్యాంగుల పించన్లు తనిఖీ చేస్తున్నట్లు ఎంపీడీవో మణికుమారి తెలిపారు. అక్రమ పించన్లు గుర్తించి తొలగించే ప్రక్రియలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల పరిధిలో మూడు వైద్య బృందాలతో తనిఖీ చేస్తామన్నారు.

స్క్రీన్ ప్రింటింగ్ శిక్షణ ముగింపు

ఏలూరు అర్బన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా యువతులు ఉపాధి అవకాశంతోపాటు మానసికోల్లాసాన్ని కూడా పొందవచ్చునని స్థానిక సెయింట్ థెరిస్సా మహిళా కళాశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ అన్నారు. కళాశాల విద్యార్థినులు, గృహిణులకు రెండు రోజుల పాటు నిర్వహించిన వర్కుషాపు, శిక్షణ బుధవారం ముగిసింది. స్టెన్సిల్ మిషన్ల స్క్రీన్‌ద్వారా, సిరాను నొక్కడంద్వారా ప్రింటింగ్ డిజైన్ సృష్టించే ప్రక్రియలపై శిక్షణనిచ్చారు.

కౌలు రైతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

చింతలపూడి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతుల కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కృష్ణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘం రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా బుధవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేషన్ ఏర్పాటు చేసి కౌలు రైతుల నుంచి ఒక శాతం మూలధనం, ప్రభుత్వం నుంచి నాలుగు శాతం మూల ధనం కలిపి ఈ మొత్తాన్ని బ్యాంకులకు చూపి బ్యాంకు నుంచి కార్పొరేషన్ అప్పు తీసుకుని కౌలు రైతుల కార్పొరేషన్ నుంచి కౌలు రైతులకు రుణాలు ఇవ్వాలని కోరారు.

రీ-సర్వే పూర్తి చేయాలి

పెదపాడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : రీ - సర్వేను సమగ్రంగా ఎటువంటి లోటుపాట్లు లేకుండా, రైతులు నష్టపోకుండా పూర్తి చేయాలని సర్వే, లాండ్ రికార్డ్స్ జిల్లా అసిస్టెంట్ డైరెక్టర్ ఎస్కే ఎండీ అన్సారీ తెలిపారు. వసంతవాడ, అమృతలింగపేటలో జరుగుతున్న రీ సర్వే పనులను బుధవారం పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో సర్వేయరు కోదండరాం, వీఆర్వోలు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ కార్యవర్గం

ఏలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): జంగారెడ్డిగూడెం రోటరీ క్లబ్-2025-26 అధ్యక్ష,కార్యదర్శులుగా పెనుమర్తి సురేష్ బాబు, సంధ్యా ప్రవల్లిక దంపతులు ఎంపికైనట్లు రోటరీ అసిస్టెంట్ గవర్నర్ దాకారపు కృష్ణ తెలిపారు. బుధవారం రోటరీ కమ్యూనిటీ హాలులో అధ్యక్ష కార్యదర్శులు ఊడా రాంగోపాల్,భవిరిశెట్టి తిలక్ అధ్యక్షతన నూతన కార్యవర్గం ఎంపిక జరిగింది.



ఆంజనేయస్వామి ఆలయంలో అశ్వత్ నారాయణ వ్రత పూజలు చేస్తున్న భక్తులు

కన్నుల పండువగా అశ్వత్ నారాయణ కల్యాణం

ముదినేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ముదినేపల్లిలో మారుతీ నగర్‌లోని భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో మాఘ పౌర్ణమి సందర్భంగా అశ్వత్ నారాయణ కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. స్థానిక ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మాడుగుల పూర్ణచంద్రరావు దంపతులు కల్యాణాన్ని నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు తిలకించారు. లక్ష్మీనారాయణ స్వామికి పూజలు జరిపారు. ఆర్యవైశ్య సంఘ ప్రముఖులు వత్తుమిల్లి సత్య ప్రసాద్, కురిచేటి తిరుమల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. అన్నసమారాధన నిర్వహించారు.

మండవల్లిలో దుర్గా మల్లేశ్వరస్వామి కల్యాణోత్సవం

మండవల్లి,ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండవల్లిలో బుధవారం రాత్రి దుర్గా మల్లేశ్వర స్వామి కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని విజయదుర్గ అమ్మవారి నవమ వార్షిక మహోత్సవాలు సందర్భంగా పండితులు చాగంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఉదయం లక్ష్మీ గణపతి హోమం, రాత్రి అమ్మవారికి, స్వామికి కల్యాణం చేశారు. కల్యాణ తలంబ్రాలను భక్తులు ఊరేగింపుగా తీసుకొచ్చారు.

18 నుంచి సెకండరీ పాఠశాలల్లో భాషోత్సవాలు

ముదినేపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో ఈనెల 18 నుంచి 21 వరకు భాషా ఉత్సవం 2025ను నిర్వహించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. సమగ్ర శిక్ష రాష్ట్ర ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు జారీ చేసిన ఆదేశాల ప్రకారం నాలుగు రోజులపాటు సెకండరీ సీనియర్ సెకండరీ పాఠశాలల్లో ఇంగ్లీష్, సంస్కృతం, హిందీ, ఉర్దూ, ట్రైబల్ భాష, కన్నడ, తమిళ్, ఒరియా, తెలుగుభాషల భాషోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 18న ఇంగ్లీష్, 19న సంస్కృతం హిందీ, ఉర్దూ, 20న ట్రైబల్, కన్నడ, తమిళ్, ఒరియా, 21న తెలుగు భాషలపై ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలను నిర్వహించేందుకు పాఠశాలలను ఎంపిక చేస్తూ సమగ్ర శిక్ష ప్రాజెక్టు డైరెక్టర్ ఆదేశాల జారీ చేశారు. ఏలూరు జిల్లాలో ఇంగ్లీష్ భాషోత్సవానికి 201 సెకంటరీ, 59 సీనియర్ సెకండరీ, ఉర్దూ భాషోత్సవానికి రెండు సెకండరీ పాఠశాలలను ఎంపిక చేశారు. ఇంగ్లీష్ భాష ప్రాముఖ్యత దృష్ట్యా ఆ భాషను ప్రమోట్ చేసేందుకు షార్ట్ స్టోరీస్ చదవడం, రాయడం, ఇంగ్లీష్ భాష ప్రాధాన్యతపై విద్యార్థులతో చర్చ నిర్వహించాలని డైరెక్టర్ తన ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆరో తరగతి నుంచి ఇంటర్ విద్యార్థులకు హిందీ సంస్కృతం, మైనార్టీ విద్యార్థుల్లో ఉర్దూను ప్రమోట్ చేసేందుకు ఈ ఉత్సవాల్లో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. భాషోత్సవాల నిర్వహణకు ఒక్కో పాఠశాలకు రోజుకి రూ.500 చొప్పున జిల్లాలో ఎంపిక చేసిన 262 పాఠశాలల్లో నాలుగు రోజులకు రూ.లక్షా 31 వేలు బడ్జెట్‌ను ప్రభుత్వం మంజూరు చేసింది.



ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

రోగుల వార్డు ఇలా.. నిరుపయోగంగా ఆపరేషన్ థియేటర్ సామగ్రి

నాడు..నేడు ఇదేనా ?

ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిన పనులు

- అత్యవసర విభాగంలోనూ అందని సేవలు
- నిలిచిన శస్త్ర చికిత్సలు
- మూడున్నరేళ్లుగా ఇదేతీరు.. రోగులు గగ్గోలు

ముసునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ముసునూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గత ప్రభుత్వంలో నాడు-నేడు పథకంలో చేపట్టిన అభివృద్ధి పనులు కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందంగా ఉన్నాయి. మూడున్నరేళ్ల క్రితం పనులు చేపట్టినా నేటికి 20 శాతం కూడా పూర్తికాకపోవడంతో పాటు చేసిన పనులు సైతం అసంపూర్తిగానే ఉన్నాయి. అభివృద్ధి పనులు చేపట్టకముందు ఈ పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు, రోగులకు అత్యవసర వైద్యసేవలను అందించే వారు. అభివృద్ధి పేరుతో వార్డు, ఆపరేషన్ థియేటర్‌లో ఇష్టానుసారంగా పనులు చేపట్టడంతో పరికరాలన్నీ చెల్లాచెదురు చేయడంతో ఈ పీహెచ్‌సీలో శస్త్రచికిత్సలు, రోగులకు అత్యవసర సేవలు నిలిచిపోయి రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

రూ. 42 లక్షలు నిధులు విడుదల

నాడు-నేడు పథకం కింద ఆర్‌అండ్‌బీ శాఖ నుంచి పీహెచ్‌సీ అభివృద్ధి పనులకు మూడున్నరేళ్ల క్రితం రూ.42 లక్షలను నిధులను విడుదల చేశారు. పీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్, వార్డుల్లో సకల సౌకర్యాల కల్పన, తలుపులు, దర్వాజాలు, కిటికీల ఏర్పాటు, మరుగుదొడ్లు, ఎలక్ట్రికల్ వర్క్స్, పాత భవనాల తొలగింపు, మీటింగ్ హాల్ నిర్మాణం, నూతన బోరు, మోటారు ఏర్పాటు, రంగులు వేయడం వంటివి చేయాల్సి ఉంది. నాడు-నేడు కింద చేపట్టిన అభివృద్ధి పనులు 20 శాతం కూడా పూర్తికాలేదు. బిగించిన తలుపులు, దర్వాజాలు, ఎలక్ట్రికల్ సామగ్రి సైతం నాసిరకంగా ఉన్నాయనే విమర్శలున్నాయి. ఈ పనులు చేపట్టిన కాంట్రాక్టర్ రెండేళ్ల క్రితం పనులు నిలిపివేశారు. గత ప్రభుత్వంలో బిల్లులు రాకపోవడం పనులు మధ్యలోనే నిలిపివేసినట్లు అధికారులు చెబుతున్నారు.

టెండర్ వేసేందుకు ఎవరూ రావడం లేదు

ముసునూరు పీహెచ్‌సీలో నిలిచిపోయిన నాడు-నేడు పనులు చేసేందుకు నూతన టెండర్లు పిలిచిన ఎవరూ ముందుకు రావడం లేదు. ఇప్పటి వరకు జరిగిన పనులకు బిల్లులు చెల్లించాం. కాంట్రాక్టర్ మాత్రం పనులు చేయనని చెప్పడంతో మళ్లీ టెండర్లు పిలిచాం. ఈ పనులకు టెండర్ పడగానే పనులు ప్రారంభిస్తాం.

- సీహెచ్ బాబూరావు
ఆర్‌అండ్‌బీ డీఈ, నూజివీడు

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు చేసుకోవాలి

ముసునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ద్వారా వచ్చే పథకాలను పొందాలంటే రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను నమోదు చేసుకోవాలని ఏవో కె.సీహెచ్ సూరిబాబు పేర్కొన్నారు. బుధవారం చింతలవల్లి, లోపూడి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యాక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన క్షేత్రస్థాయిలో మొక్కజొన్న పంటలను పరిశీలించి, సస్యరక్షణ చర్యలను వివరించారు. అనంతరం జరిగిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం నూతనంగా చేపట్టిన విశిష్ట సంఖ్య నమోదుకు పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ జిరాక్సులు, ఆధార్‌కు లింకైన ఫోన్ నంబరును తీసుకుని రైతు సేవా కేంద్రాలను వెళ్లి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. ఏఈవో రామకృష్ణ, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

200 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

చాట్రాయి, ఫిబ్రవరి 12(ఆంధ్రజ్యోతి) నవోదయం 2.0 కార్యక్రమంలో భాగంగా మండలంలోని పోలవరంలో బుధవారం జరిపిన దాడిలో సారా తయారీకి సిద్ధంగా ఉన్న 200 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసి, ముల్లంగి యాదగిరిపై కేసు నమోదు చేశామని నూజివీడు ఎక్సైజ్ సీఐ మస్తానయ్య తెలిపారు. దాడిలో ఎస్‌ఐలు ఈశ్వరరావు, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా నాగేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

ముసునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గోపవరం శివారు నాగేంద్రపురంలో వున్న నాగేంద్రస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు చిట్టిబాబు స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. కమిటీ సభ్యులు, గ్రామ ప్రముఖులతోపాటు భక్తులు స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధనలో భక్తులు స్వీకరించారు.





కలిదిండి మండలం పెదలంకలో, ముదినేపల్లి మండలం పెదగొన్నూరులోని తాగునీటి చెరువులను మోటార్ పంపులతో నింపుతున్న దృశ్యం

తాగునీటి చెరువులకు నీళ్లు

ముదినేపల్లి/కలిదిండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాల్వలకు నీటి విడుదల పెంచడంతో ముదినేపల్లి మండలంలోని పంచాయతీ మంచి నీటి చెరువులకు పుష్కలంగా నీరు నింపే అవకాశం కలిగింది. మండలంలోని పోల్ రాజ్, క్యాంప్‌బెల్ ప్రధాన కాల్వలతోపాటు బంటుమిల్లి మెయిన్ డిస్ట్రిబ్యూటరీ ఛానల్ కూడ గుడ్లవల్లేరు, కమలాపురం లాకుల వద్ద సరిపడినంత నీటిని విడుదల చేశారు. క్యాంప్ బెల్ కెనాల్‌కు 300 క్యూసెక్కులు, పోల్‌రాజ్ కెనాల్‌కు 340, బీఎండీ ఛానల్‌కు 80 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తుండడంతో మండలంలోని అన్ని గ్రామాల మంచినీటి చెరువులను పూర్తిస్థాయిలో నింపుకునే అవకాశం ఏర్పడింది. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ స్పష్టమైన ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు మంచినీటి చెరువులను నింపేందుకు చర్యలు తీసుకున్నారు. వడాలి, ముదినేపల్లి సెక్షన్ల ఏఈలు సిద్ధార్థ, కిషోర్ పర్యవేక్షణలో చెరువులకు నీటి పంపిణీ కార్యక్రమం జరుగుతున్నది.

- కలిదిండి మండలంలో అడుగంటిన తాగునీటి చెరువులను అధికారులు యుద్ధ ప్రాతిపదికన నింపుతున్నారు. రాబోయే వేసవిలో గ్రామాల్లో మంచినీటి సమస్య తలెత్తకుండా ఇరిగేషన్ అధికారులు చర్యలు చేపట్టారు. మండలంలో మొత్తం 28 తాగునీటి చెరువులు ఉన్నాయి. 27 చెరువులను నింపుతున్నారు. ఇప్పటికే 80 శాతం వరకు నింపారు. చినతాడినాడ తాగు నీటి చెరువును నింపాల్సి ఉందని ఇరిగేషన్ అధికారులు తెలిపారు.



శివరాత్రి ఉత్సవాలు ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఐ రవికుమార్

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : సీఐ

కలిదిండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): శివరాత్రిని పురస్కరించుకుని భోగేశ్వర స్వామి కల్యాణోత్సవాల్లో వాహనాల ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నామని సీఐ రవికుమార్ తెలిపారు. కలిదిండిలో బుధవారం భోగేశ్వరస్వామి కల్యాణోత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాల పార్కింగ్‌లో భక్తులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కలిదిండి ఎస్‌ఐ వి.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



కొల్లేటికోటలో హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

పెద్దింట్లమ్మ ఆదాయం రూ.9,93,961

కైకలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : కొల్లేటికోట పెద్దింటి అమ్మవారికి భక్తులు సమర్పించిన కానుకల మొక్కుబడుల హుండీల ఆదాయం 113 రోజులుకు గాను రూ.9,93,961 వచ్చినట్టు ఈవో శ్రీనివాస్ తెలిపారు. హుండీలను బుధవారం ఏలూరు పవర్‌పేట శ్రీవాసు ఆలయ ఈవో ఎం.రామాంజనేయులు పర్యవేక్షణలో లెక్కింపును నిర్వహించారు. ఆలయ సిబ్బంది, పోలీసులు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

మండవల్లి ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరికేగూడెం వద్ద 165వ జాతీయ రహదారిపై స్కూటీ అదుపు తప్పి కింద పడడంతో ఒక వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. ఒక వ్యక్తి బుధవారం రాత్రి స్కూటీపై లింగాల నుంచి మండవల్లి వైపు వస్తూ రోడ్డు పక్కన కంకర గుట్ట ఎక్కించి కింద పడడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించగా, క్షతగాత్రుడిని 108లో గుడివాడ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది. మండవల్లి దళితవాడకు చెందిన వ్యక్తిగా భావిస్తున్నారు. దీనిపై పోలీసులకు ఎటువంటి ఫిర్యాదు అందలేదు.



ఘటనా స్థలి వద్ద క్షతగాత్రుడు



కైకలూరులో ఎమ్మెల్సీ అభ్యర్థి గెలుపు కోసం కరపత్రాలు పంపిణీ చేస్తూ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్ వీరంకి గురుమూర్తి, కూటమి నేతలు

విస్తృతంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం

కైకలూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అఖండ మెజార్టీతో గెలిపించాలని రాష్ట్ర గౌడ కార్పొరేషన్ చైర్మన్, ఎన్నికల పరిశీలకుడు వీరంకి గురుమూర్తి కోరారు. కైకలూరులో ఆలపాటి గెలుపు కోరుతూ బుధవారం పట్టభద్రుల ఓటర్ల ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 14వ తేదీ నుంచి ప్రభుత్వ కార్యాలయాల్లో, పాఠశాలల్లో ప్రచారం నిర్వహించేం దుకు పది బృందాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. నియోజక కన్వీనర్ వీరమల్లు నరసింహారావు, కో కన్వీనర్ తేరా రమేష్, మండల టీడీపీ అధ్యక్షుడు పెన్మెత్స త్రినాథరాజు, జిల్లాపార్టీ కార్య నిర్వహణ కార్యదర్శి పోలవరపు లక్ష్మీరాణి, ఎంపీటీసీ మంగినేని రామకృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కాల్వల వెంబడి ఆక్రమణలు తొలగించాలి

కలిదిండి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కాల్వల వెంబడి ఉన్న ఆక్రమణలను తొలగించాలని కలిదిండి, కోరుకొల్లు డీసీ చైర్మన్లు ముద్దం భోగేశ్వరరావు, పేటేటి సత్యనారాయణలు ఇరిగేషన్ అధికారులకు సూచించారు. సీబీ కెనాల్ గట్ల వెంబడి ఉన్న చెత్త కుప్పలను తొలగింపు పనులను బుధవారం పెదగొన్నూరు డీసీ చైర్మన్ సురేష్‌బాబుతో కలసి పరిశీలించారు. గుర్వాయి పాలెం నుంచి పెదలంక కాల్వ వెంబడి ఆక్ర మణలు అధికంగా ఉన్నాయని, దీంతో నీటి సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు నీరు కలుషితమవుతోందన్నారు.



చాట్రాయి తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న కార్మిక సంఘ నాయకులు

కౌలు రైతుల సంక్షేమానికి చట్టం చేయాలి

చాట్రాయి/ముసునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కౌలురైతుల సంక్షేమం, రక్షణకు ప్రభుత్వం చట్టం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. బుధవారం చాట్రాయి తహసీల్దార్ ప్రశాంతికి వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం, కౌలురైతు సంఘం నాయకురాలు అన్నపరెడ్డి అనూష వినతిపత్రం అందజేశారు. ముసునూరు మండలంలో తహసీల్దార్ కె.రాజ్‌కుమార్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శి రాయంకుల లక్ష్మణరావు ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు విలేకరులతో మాట్లాడుతూ పలు కారణాల వల్ల వ్యవసాయంలో కౌలురైతుల సంఖ్య ఏడాదికి ఏడాది గణనీయంగా పెరుగుతుండగా, భూయజమానులు కౌలు పత్రాలపై సంతకాలు పెట్టకపోవడం వల్ల గుర్తింపు కార్డులు అందక కౌలురైతులు నష్టపోతున్నారన్నారు. గ్రామ సభలు నిర్వహించి భూయజమానుల ప్రమేయం లేకుండా అర్హత ఉన్న ప్రతి కౌలురైతుకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

దంత వ్యాధుల నిర్లక్ష్యంతో గుండెకు ఇబ్బంది

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): దంత సంబంధ వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే గుండెకు కూడా ఇబ్బంది కలుగుతుందని డాక్టర్ దేవిశెట్టి దినేష్‌బాబు తెలిపారు. నూజివీడు కుమార్ సీబీఎస్‌ఈ పాఠశాలలో బుధవారం ఉచిత దంత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. భాను స్మైల్ దంతవైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత దంతవైద్య పరీక్షలను నిర్వహించి మందులను అందించారు. పాఠశాల చైర్మన్ పీవీ కుమార్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	125, 134, 145
చికెన్ విత్ స్కిన్	240
చికెన్ స్కిన్‌లెస్	250

నెక్ కోడి గుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.475





సరస్వతి అలంకరణలో బాలరావమ్మ.. అమ్మవారిని దర్శించుకుంటున్న మంత్రి పార్థసారథి

వైభవంగా బాలరావమ్మ తిరునాళ్లు

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి తోటపల్లి, కనసానపల్లి గ్రామాల్లో వున్న దుగ్గిరాల బాలరావమ్మ మాఘ పౌర్ణమి తిరునాళ్ల సందర్భంగా బుధవారం సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పాలపొంగళ్ళ, పసుపు, కుంకుమ, చీర, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అన్నదానం నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్‌ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథి అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రూ.2 కోట్లతో ఆగిరిపల్లిలోని శోభనాచల దేవాలయానికి నిర్మించే ఘాట్‌రోడ్డు త్వరలో ప్రారంభిస్తామన్నారు. ఆరేపల్లి శ్రీనివాసరావు, చిట్టినేని శివరామకృష్ణ, మడుపల్లి గోపాల్, నక్కనబోయిన వేణు, పల్లగాని గంగాధర్, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలి

నూజివీడు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు అందించాలని కళాశాల విద్య డైరెక్టర్ డాక్టర్ నారాయణ్‌భరత్‌గుప్తా సూచించారు. బుధవారం ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో విద్యార్థులకు అందుతున్న వసతి సౌకర్యాలను ఆయన పరిశీలించారు. క్యాంపస్‌లో మెస్, కిచెన్ ఏరియా, స్టోర్‌రూమ్‌లను పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న భోజన నాణ్యత తదితరాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం అకడమిక్ బ్లాక్‌లో ఉన్న తరగతిగదులను పరిశీలించిన అనంతరం ఉన్నతాధికారులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా క్యాంపస్‌లో అకాడమిక్, హాస్టల్ తదితర అంశాల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ అమరేంద్రకుమార్, ఏవో బి.లక్ష్మణ్, సీఏవో బండి ప్రసాద్, డీన్ ఆఫ్ అకడమిక్స్ డాక్టర్ చిరంజీవి, శ్రీనాథ్, బ్రహ్మస్వాములు, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న నారాయణ్ భరత్‌గుప్తా

పాడి గేదెల కోసం చెరువులోకి దిగి ఒకరి మృతి

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పాడిగేదెలను చెరువునుంచి బయటకు తీసుకురావాలని, చెరువులోకి దిగిన వ్యక్తి మృతిచెందిన ఘటన దేవరగుంట గ్రామంలో జరిగింది. నూజివీడు రూరల్ పోలీసులు తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన పలగాని కృపారావు(56) పాడే జీవనాధారంగా బతుకుతున్నాడు. ఈ క్రమంలో పశువుల మేతకోసం గేదెలను గ్రామంలోని కోతులగుంట చెరువుకు తీసుకువెళ్ళగా గేదెలు చెరువులోకి దిగాయి. ఎంతసేపటికి అవి బయటకు రాకపోవడంతో గేదెలను బయటకు తోలేందుకు చెరువులో దిగిన అతడు చెరువులోని భారీ గోతిలోకి జారిపోయాడు. దీన్ని గమనించిన స్థానికులు ప్రమాద ఘటనను కుటుంబసభ్యులకు తెలుపడంతో కుటుంబసభ్యులు చెరువు వద్దకు చేరుకుని బయటకు వెలికితీశారు. అప్పటికే అతడు ప్రాణాలు వదలడంతో నూజివీడు రూరల్ పోలీసులకు సమాచారమిచ్చారు. హెడ్‌కానిస్టేబుల్ జి.విజయ్‌బాబు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మాట్లాడుతున్న లిబరేషన్ నాయకులు

కూటమి హామీలను అమలు చేయాలి

ముసునూరు, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసేలా చర్యలు చేపట్టాలని సీపీఐ(ఎంఎల్)లిబరేషన్ మండల కార్యదర్శి వేముల బక్కయ్య డిమాండ్ చేశారు. బుధవారం రమణక్కపేటలో అఖిల భారత ప్రగతిశీల మహిళా సంఘం 32వ వ్యవస్థాపక దినోత్సవాన్ని గ్రామ అధ్యక్షురాలు నందిపాము రాణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మహిళల ఆశయాలు, హక్కులకు అనుగుణంగా నేటికి ప్రభుత్వాలు ఇచ్చిన వాగ్దానాలు అమలు జరపకుండా దగా చేస్తున్నాయని విమర్శించారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేయాలని కోరారు. మహిళా సంఘం నాయకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో నూజివీడు విద్యార్థుల ప్రతిభ



ఎ.మధుసై

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ మెయిన్స్‌లో నూజివీడు విద్యార్థులు సత్తాచాటారు నూజివీడు సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థి అరవ మధుసై మెయిన్స్‌లో 97.69శాతం మార్కులు సాధించినట్లు కళాశాల జి.శ్రీమన్నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థిని సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ గొల్లపూడి రవిబాబు, తోటకూర సాంబశివరావు, మోరంపూడి సత్యనారాయణ అభినందించారు. త్రివిధ పాఠశాలకు చెందిన పూర్వవిద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించారని, తమ పాఠశాల పూర్వ విద్యార్థులు బోనాల నిఖిత, మెయిన్స్‌లో 99.88శాతం మార్కులు సాధించగా, తొమ్మండ్రు హర్షిత్‌జీవన్, జేఈఈ మెయిన్స్‌లో 99.65 శాతం మార్కులు సాధించినట్లు త్రివిధ ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు.